ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5
ప్రకాశం
జిల్లా వార్తలు
సోమవారం 11, ఆగస్టు 2025

ఎమర్జెన్సీ దోపిడీ

ఒంగోలులోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్) వద్ద ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకుల ఇష్టారాజ్యం నడుస్తోంది. అత్యవసర సేవల కోసం వైద్యశాలకు వచ్చిన వారి అవసరం, ఆందోళనను ఆసరా చేసుకొని అందినకాడికి దోచుకుంటున్నారు. ఆక్సిజన్, వైద్యపరికరాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలను నడుపుతూ రోగులు, వారి బంధువుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. ఆసుపత్రిలో చేరిన వారి వద్ద వెంటనే వాలిపోతున్నారు. జీజీహెచ్‌లో సక్రమంగా వైద్యం అందదని భయపెడుతున్నారు. కార్పొరేట్, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లాలని సూచిస్తూ మానసికంగా వారిని ఆవైపునకు సిద్ధం చేస్తున్నారు. అంతిమంగా రోగిని అక్కడికి తరలించి ప్రైవేటు, కార్పొరేట్ వైద్యశాలల నుంచి భారీగా కమీషన్లు తీసుకుంటున్నారు. అసలు వైద్యశాలలోని కొందరు డాక్టర్‌లు, సిబ్బంది కూడా 'ప్రైవేటు' ఏజెంట్లుగా మారారు. అంబులెన్స్ డ్రైవర్లకు సంపూర్ణ సహకారం అందిస్తున్నారు. వీరికి కూడా ప్రైవేటు, కార్పొరేట్ వైద్యశాలల నుంచి పెద్దమొత్తంలోనే డబ్బులు ముడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో జీజీహెచ్ అంటేనే ప్రజలు భయపడిపోతున్నారు.


ఒంగోలు జీజీహెచ్ వద్ద నుంచి రోగిని తీసుకెళుతున్న అంబులెన్స్

- ప్రైవేటు అంబులెన్స్ నిర్వాహకుల అడ్డగోలు వ్యవహారం
- జీజీహెచ్ వద్ద ఇష్టానుసారంగా చార్జీల వసూలు
- వాహనాల్లో కనిపించని ఆక్సిజన్, వైద్య పరికరాలు
- కాలం చెల్లినవి నడుపుతూ రోగుల ప్రాణాలతో చెలగాటం
- ఏజెంట్లుగా ఆసుపత్రి సిబ్బంది
- ప్రైవేటు వైద్యశాలలతో డీల్

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అత్యవసర సమయంలో రోగుల ప్రాణాలను కాపాడటంలో వైద్యుడి పాత్ర ఎంత ముఖ్యమో.. మెరుగైన చికిత్స కోసం సకాలంలో ఆసుపత్రికి తరలించడంలో అంబులెన్స్ సేవలు అంతే ప్రధానం. కొన్ని సందర్భాల్లో రోగులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడుతున్న అంబులెన్స్ డ్రైవర్లు కూడా ఉన్నారు. కానీ ఒంగోలులోని సర్వజన ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్) వద్ద ఎమర్జెన్సీ దోపిడీ నడుస్తోంది. ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకులు రోగి పరిస్థితిని బట్టి వేలకు వేలు గుంజుతున్నారు. జీజీహెచ్ నుంచి ఒంగోలులోని వేరే ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు రవాణాతోపాటు, ఆక్సిజన్, ఇతరత్రా చార్జీలు అంటూ రూ.10వేల వరకూ వసూలు చేస్తున్నారు. ఇక గుంటూరు, విజయవాడ తీసుకెళ్లాల్సి వస్తే రూ.30వేల నుంచి రూ.40వేలు గుంజుతున్నారు. పగలు ఒకరేటు.. రాత్రి వేళ మరో రేటు వసూలు చేస్తూ దందా సాగిస్తున్నారు.

కాలం చెల్లిన వాహనాలు.. పట్టించుకోని అధికారులు

ఒంగోలు జీజీహెచ్ కేంద్రంగా కొన్నేళ్లుగా రోగుల ప్రాణాలతో వ్యాపారం చేస్తున్న అంబులెన్స్‌ల నిర్వాహకులపై అధికారులు దృష్టి సారించడం లేదు. దీన్ని ఆసరా చేసుకొని వారు ఒకే నంబరు ప్లేటుతో రెండు, మూడు వాహనాలను నడుపుతున్నారు. కొన్ని అంబులెన్స్‌ల్లో అవసరమైన ఆక్సిజన్, వైద్య పరికరాలు ఏమీ ఉండటం లేదు. కేవలం ఒక స్ట్రెచర్, రోగి తరఫున ఉండే వ్యక్తి కూర్చుకునేందుకు మరో సీటు మాత్రమే ఉంటుంది. జీజీహెచ్ వద్ద సుమారు 35కి పైగా ప్రైవేటు అంబులెన్స్‌లు ఉండగా వాటిలో అనేకం అరిగిపోయిన టైర్లు, కాలం చెల్లిన ఇంజన్‌లతో నడుపుతున్నారు. కనీస ఫిట్‌నెస్ కూడా లేని వాహనాలను అంబులెన్స్‌లుగా మార్చేసి జోరుగా వ్యాపారం చేస్తున్నారు.

108 ఉండీ ఉపయోగం ఏదీ?

ప్రాణాపాయ స్థితిలో ఉన్న పేద రోగులను ఆసుపత్రికి తరలించడం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 108 వాహనాలు ఉండీ ఉయోగం లేకుండాపోతోంది. ఎక్కడైనా ప్రమాదం జరిగినా, వ్యక్తి ప్రాణాపాయ స్థితిలో ఉన్నా 108కి కాల్ చేస్తే రయ్.. రయ్ మంటూ వచ్చే వాహనాలు మొక్కుబడి సేవలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. గత వైసీపీ పాలన నుంచి ఈ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా రోగిని ఇంటి దగ్గర నుంచి సమీపంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రికి తరలించి 108 సిబ్బంది చేతులు దులుపుకుంటున్నారు. ఆ తర్వాత వైద్య పరీక్షలు, మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే కచ్చితంగా ప్రైవేటు అంబులెన్స్‌లను ఆశ్రయించక తప్పడం లేదు. అత్యవసర పరిస్థితిని ఆసరా చేసుకొని అంబులెన్స్‌ల నిర్వాహకులు అందినకాడికి దండుకుంటున్నారు. జీజీహెచ్‌లో వైద్యం కోసం వస్తే ఎమర్జెన్సీ పేరుతో భారీగా దోచేస్తున్నారని బాధితులు బోరుమంటున్నారు.


జీజీహెచ్ వద్ద అంబులెన్స్‌లు

వైద్యులు, సిబ్బంది సహకారం

పేదల పెద్దాసుపత్రి అయిన జీజీహెచ్‌లో కొందరు వైద్యులు, సిబ్బంది అంబులెన్స్ డ్రైవర్లకు సహకారం అందిస్తున్నారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వచ్చే రోగులను భయపెడుతున్నారు. ఇక్కడ సరైన వైద్యం అందదని, ప్రాణాలకు గ్యారెంటీ లేదని చెప్తూ ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లండని సలహా ఇస్తున్నారు. రోగిని తమ ఆసుపత్రికి సిఫారసు చేస్తే సిబ్బందికి ప్రైవేటు వారు రూ.1000 వరకు కమీషన్ ముట్టచెప్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అంబులెన్స్ డ్రైవర్లకు కేసును బట్టి రూ.3వేల వరకూ ఇస్తున్నట్లు సమాచారం.

రాజముద్రతో పాసుపుస్తకం

- గత వైసీపీ హయాంలో జగన్ చిత్రంతో పంపిణీ
- వాటి స్థానంలో కొత్తవి ఇవ్వాలని ప్రజాప్రభుత్వం నిర్ణయం
- జిల్లాకు చేరిన 65,038 పుస్తకాలు
- ఈనెల 15 నుంచి 31 వరకు రైతులకు అందజేత



ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ హయాంలో రైతులకు ఇచ్చిన పట్టాదారు పాసుపుస్తకాలు రద్దుకానున్నాయి. వాటి స్థానంలో రాజముద్రతో కొత్తవి పంపిణీ చేసేందుకు ప్రస్తుత ప్రజా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వారసత్వంగా వచ్చిన ఆస్తికి సంబంధించిన పట్టాదారు పుస్తకాలపై నాటి సీఎం ఫొటో పెట్టుకోవడంపై రైతులు అభ్యంతరం వ్యక్తంచేసినా అప్పటి పాలకులు పట్టించుకోలేదు. ఈనేపథ్యంలో ప్రజాప్రభుత్వంలో పాత పట్టాదారు పుస్తకాలను రద్దు చేసి వాటి స్థానంలో రాజముద్రతో కొత్తవి పంపిణీ చేయాలని నిర్ణయించారు. వైసీపీ ప్రభుత్వంలో తొలివిడతగా రీసర్వే చేసిన గ్రామాల్లోని రైతులకు కొత్తవి అందజేయనున్నారు.

డివిజన్ కేంద్రాలకు చేరిన పుస్తకాలు

జిల్లాకు తొలి విడతలో పంపిణీ చేసేందుకు ఇప్పటివరకు 65,038 పాసుపుస్తకాలు డివిజన్ కేంద్రాలకు చేరాయి. అక్కడ మండలాల వారీగా విభజన చేసి పంపుతున్నారు. ఈనెల 15వతేదీ నుంచి 31వతేదీ వరకు రైతులకు వాటిని పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా చర్యలు తీసుకున్నారు. గ్రామాల వారీగా తహసీల్దార్ల ఆధ్వర్యంలో సదస్సులు ఏర్పాటు చేసి రైతులకు పంపిణీ చేయనున్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్యేలతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని ఆదేశించడంతో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. అందుకు సంబంధించి షెడ్యూల్‌ను కూడా రూపొందిస్తున్నారు. ఆ ప్రకారం గ్రామాల వారీగా రాజముద్రతో ఉన్న పట్టాదారుపుస్తకాలు పంపిణీ చేస్తారు.

డివిజన్ల వారీగా జిల్లాకు వచ్చిన పట్టాదారుపుస్తకాల వివరాలు ఇవీ

డివిజన్	పుస్తకాలు
ఒంగోలు	29,611
కనిగిరి	18,598
మార్కాపురం	16,829
మొత్తం	65,038

ఏం కొంటాం.. ఏం తింటాం..

- దడ పుట్టిస్తున్న కూరగాయల ధరలు
- ఘాటెక్కిన పచ్చి మిర్చి
- కిలో రూ.60కి చేరిన టమాటా
- దొండ, దోస మినహా అన్నీ రూ.50పైనే
- మరికొద్ది రోజులు ఇదే పరిస్థితి
- కొనసాగే అవకాశం
- ఉత్పత్తి తగ్గడమే
- కారణమంటున్న వ్యాపారులు





కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. ముట్టుకుంటేనే మండిపోతున్నాయి. టమాటా కిలో రూ.60కి చేరి రారెత్తిస్తోంది. పచ్చిమిర్చి కిలో రూ.80కి చేరి మంట పుట్టిస్తోంది. క్యారెట్ రూ.70 పలుకుతూ క్యారేట్ అనిపిస్తోంది. బీన్స్, పెద్దచిక్కుళ్లు సెంచరీ కొట్టాయి. దోస, దొండ మినహా మిగిలినవన్నీ కిలో రూ.50కిపైన పలుకుతున్నాయి. దీంతో సామాన్యులు ఏం కొంటాం.. ఏం తింటాం అని నిట్టూరుస్తున్నారు.

- ఒంగోలు కలెక్టరేట్, (ఆంధ్రజ్యోతి)

స్థానికంగా తగ్గిన ఉత్పత్తి

జిల్లాలో సాధారణంగా ఈ సమయానికి కూరగాయల ఉత్పత్తి గణనీయంగా పెరగాల్సి ఉంది. సకాలంలో వర్షాలు కురవకపోవడం, నెలరోజులుగా వేసవిని తలపిస్తూ ఎండల తీవ్రత పెరగడంతో ఆ ప్రభావం కూరగాయల సాగుపై పడింది. ఉత్పత్తి భారీగా పడిపోయింది. వినియోగానికి అనుగుణంగా స్థానికంగా కూరగాయల సరఫరా జరగడం లేదు. జిల్లాలోని పలు ప్రాంతాలకు మార్టూరు, కొత్తపట్నం ప్రాంతాల నుంచి పలు రకాల కూరగాయలు వస్తాయి. ఈ సమయానికి పశ్చిమం నుంచి పచ్చిమిర్చి, టమాటా ఎక్కువగా సరఫరా అవుతాయి. ఆ ప్రాంతాల నుంచి పూర్తిగా తగ్గిపోయాయి. దీంతో వ్యాపారులు ఇతర జిల్లాలు, కొన్నింటిని ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. చెన్నై, పలమనేరు, మదనపల్లి వెళ్లి కొనుగోలు చేసి ఇక్కడికి తీసుకువస్తున్నారు. అక్కడ డిమాండ్ ఉండటం, రవాణా చార్జీలు అధికమవుతుండటంతో అనివార్యంగా ధరలు పెంచాల్సి వస్తున్నదని వ్యాపారులు చెప్తున్నారు.

ఒక్కోరోజు ఒక్కో ధర

వేసవిలో పెరగాల్సిన కూరగాయల ధరలు ఇప్పుడు చుక్కల్లో చేరడంతో సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. ఏరోజు ఏరకం కూరగాయల ధర పెరుగుతుందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ప్రధానంగా ప్రజలు ప్రతిరోజూ వంటకు ప్రధానంగా వినియోగించే టమాటా, పచ్చి మిర్చి ధరలు భారీగా పెరిగాయి. నిన్నమొన్నటి వరకూ కిలో రూ.40కి లభించిన టమాటా ధర ఇప్పుడు రూ.60కి చేరింది. హోల్‌సేల్‌లో ఈ ధర ఉండగా.. ఇళ్ల వద్దకు వచ్చి విక్రయించేవారు పావు కిలోకు రూ.20 నుంచి రూ.25 వసూలు చేస్తున్నారు. ఇక పచ్చిమిర్చి ధర కూడా కిలో రూ.80కి చేరింది. రిటైల్ వ్యాపారులు రూ.90 వరకూ వసూలు చేస్తున్నారు.

కూరగాయల రకం	కిలో ధర (రూ.లలో)
బీన్స్	100.00
బీట్‌రూట్	80.00
క్యారెట్	70.00
టమాటాలు	60.00
పచ్చిమిర్చి	80.00
వంకాయలు	60.00
బీర	60.00
బెండ	50.00
చామదుంప	50.00
పెద్దచిక్కుళ్లు	100.00
బంగాళాదుంప	50.00
కాకర	60.00
దొండ	40.00
దోస	30.00

ఈ చిన్నారులు కనిపించలేదా?

- పీ-4 సర్వేలో అధికారుల నిర్లక్ష్యం
- తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా ముగ్గురు పిల్లలు
- తమ్ముడు, చెల్లి కోసం కూలికి వెళ్తున్న అక్క
- ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూపులు

ఆ కుటుంబంలో ముగ్గురు చిన్నారులు తల్లిదండ్రులను కోల్పోయిన అనాథలు. ఉండడానికి ఇల్లు లేదు. తిండి లేదు. దిక్కుతోచని స్థితిలో ఇంటింటికీ తిరుగుతూ ఎవరైనా అన్నం పెడితే తిని జీవిస్తున్నారు. అధికారులకు ఈ చిన్నారులు కనిపించలేదు. పీ-4 సర్వేలో వీరిని గుర్తించకపోవడం గమనార్హం.


భావన, కీర్తన, యశ్వంత్

బేస్తవారపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామానికి చెందిన అరవీటి శ్రీనివాసులు, ఉమ అనే దంపతులు మూడేళ్ల క్రితం నెల రోజుల వ్యవధిలోనే ఒకరి తర్వాత మరొకరు అనారోగ్యంతో మృతి చెందారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. వారిలో భావన (13 ఏళ్లు) పెద్ద అమ్మాయి. తల్లిదండ్రులు చనిపోయాక భావన చెల్లి కీర్తన, తమ్ముడు యశ్వంత్‌కు పెద్ద దిక్కయింది. వారిని చదివించాలని భావించి ఒక పక్క తానూ చదువుతూనే సెలవు రోజుల్లో కూలి పనులకు వెళ్తోంది. వచ్చిన డబ్బులతో చాలీచాలని జీవనం సాగిస్తున్నారు. కంభం మండలం నల్లగాల్వ గ్రామ పాఠశాలలో భావన, యశ్వంత్ 8వ తరగతి చదువుతున్నారు. కీర్తన 7వ తరగతి అభ్యసిస్తోంది. ముగ్గురూ నిత్యం 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చి వీరే భోజనం వండుకొని తింటున్నారు. నా అనేవారు లేక, వసతులు లేక, ఆర్థిక ఇబ్బందులతో చిన్నారులు సతమతమవుతున్నారు. దీనస్థితిలో ఉన్న పేద కుటుంబాలను ఆదుకునేందుకు ప్రజా ప్రభుత్వం పీ-4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. అయితే స్థానిక అధికారులు పీ-4 సర్వేలో నిర్లక్ష్యంగా ఉన్నారన్నది ఆ ముగ్గురు చిన్నారులను చూస్తే అర్థమవుతోంది. మండలంలో రెండో విడత పీ-4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల్లో వారు ముగ్గురు ఉన్నారని ఎంపీడీవో ఏవీ రంగనాయకులు చెప్పారు.

నల్లమలలో నెట్‌వర్క్

- గిరిజన గూడేల వద్ద సెల్ టవర్లు
- నాలుగుచోట్ల నిర్మాణం
- త్వరలోనే పూర్తయ్యేలా చర్యలు

నల్లమల అటవీ ప్రాంత ప్రజలకు ముఖ్యంగా గిరిజన గూడెంలలో చెంచులు నివాసముండే ప్రాంతాలకు వెళితే బాహ్య ప్రపంచంతో సంబంధాలు ఇక ఉండవు. మారిన పరిస్థితులకు తగ్గట్టు టెక్నాలజీ ఎంత అందుబాటులోకి వచ్చినా వారికి మాత్రం అవన్నీ దూరమే అని చెప్పొచ్చు. కారణం అటవీ ప్రాంతం కావడం, మరీ ముఖ్యంగా నల్లమల అభయారణ్యం (టైగర్ రిజర్వ్ జోన్) కావడమే. అలాంటి చోట సాంకేతికత వినియోగానికి ఎన్నో ఏళ్లుగా వాళ్లు చేస్తున్న ప్రయత్నానికి ప్రస్తుతం ఫలితం దక్కింది. దీంతో నల్లమలలో కూడా సెల్‌ఫోన్ సిగ్నల్స్ రాబోతున్నాయి.


బిళ్లగొందిపెంటలో సెల్ టవర్ కోసం స్థలానికి రాళ్లు పాతి హద్దులు పెట్టిన అధికారులు

త్రిపురాంతకం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎర్రగొండపాలెం, పుల్లలచెరువు, దోర్నాల మండలాల్లోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న నాలుగు గిరిజన గూడేల్లో సెల్ టవర్ల నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో ఎర్రగొండపాలెం మండలంలోని బిళ్లగొందిపెంట, పుల్లలచెరువు మండలంలోని గారపెంట, చెన్నపాలెం, దోర్నాల మండలంలోని పెద్దమంతనాల చెంచుగూడేలు ఉన్నాయి. ఇందులో గారపెంటగూడెంలో ఎయిర్‌టెల్ కంపెనీ టవర్ నిర్మిస్తుండగా, మిగిలిన మూడుచోట్ల బీఎస్ఎన్ఎల్ టవర్ల నిర్మాణం జరుగుతున్నాయి. ఇందుకోసం మంజూరు ఉత్తర్వులు 2024 డిసెంబరులోనే వచ్చాయి. వెంటనే కలెక్టర్ తమీమ్ అన్సారియా అటవీ శాఖ అధికారులతో సమావేశమై ఆశాజనకంగా అడ్డంకులు తొలగి నిర్మాణాలకు అవసరమైన క్లియరెన్స్‌లు ఇచ్చేలా చర్యలు చేపట్టారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఈ పనులను ఆర్‌వోఎఫ్ఆర్ చట్టానికి లోబడి చేయాల్సి ఉంది. దీంతో పాటు వైల్డ్‌లైఫ్ ఏరియా ఉన్నచోట అదనంగా పలు అనుమతులు తీసుకోవాల్సి ఉండడంతో పనుల్లో కాస్త జాప్యం కనిపించింది. ఇప్పుడిప్పుడే బీఎస్ఎన్ఎల్ అధికారుల చొరవతో పనుల్లో వేగం పుంజుకుంది. బిళ్లగొందిపెంట, పెద్దమంతనాల గూడేలు వైల్డ్‌లైఫ్ పరిధిలో ఉండడంతో ఉన్న అవాంతరాలు అధిగమించేందుకు స్థలం కోసం అటవీశాఖకు చెల్లించాల్సిన డబ్బు కూడా చెల్లించారు. ఇప్పటికే సైట్ క్లియరెన్స్ తీసుకున్నారు. టవర్ నిర్మాణానికి తీసుకున్న స్థలాల్లో హద్దులను కూడా ఏర్పాటు చేసుకున్నారు. స్టేజ్-1 ప్రక్రియ పూర్తి చేసుకున్న ఈ రెండు టవర్ల నిర్మాణ పనులు త్వరలోనే పూర్తి చేస్తామని అధికారులు చెప్తున్నారు. ఇక చెన్నపాలెం గూడెంలో స్టేజ్-1 ప్రక్రియ పూర్తి కాలేదని, స్థల సేకరణ జరిగిన తరువాత పనులు ప్రారంభించాల్సి ఉందంటున్నారు. గార్లపెంట గిరిజన గూడెంలో ఎయిర్‌టెల్ సెల్ టవర్ నిర్మాణం కూడా త్వరలోనే ప్రారంభం కానుంది. ఇలా కొద్దిరోజుల్లో నల్లమల గిరిజన గూడేలలో కూడా సెల్‌సిగ్నల్స్ అందుబాటులోకి రానుండటంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇక వెంటనే సమాచారం

గతంలో నల్లమల అటవీ ప్రాంతంలోని గ్రామాల్లో ఏదైనా ఘటన జరిగితే అక్కడ నుంచి ఎవరైనా వచ్చి చెబితేనే తెలిసే పరిస్థితి. అధికారుల పర్యటల్లో కానీ, చివరకు ఎన్నికల సమయంలో కూడా అధికారులు ఆ ప్రాంతం నుంచి సమాచారం సేకరించుకునేందుకు అష్టకష్టాలు పడేవారు. ఇప్పటికీ పలు గూడేలలో సెల్ సిగ్నల్స్ వచ్చే ప్రాంతాలకు కొందరు యువకులు వచ్చి గుట్టలు, కొండలు ఎక్కి ఫోన్‌లు మాట్లాడుకున్న తరువాత ఇళ్లకు వెళుతున్నారు. ఇక ఈ టవర్ల నిర్మాణం జరిగితే సమాచార కష్టాలు తొలగిపోయినట్లేనని నల్లమలలో కూడా నెట్‌వర్క్ రాబోతుందని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.



రైతుల కృతజ్ఞతా ర్యాలీ

అన్నదాత సుఖీభవ నగదు ఇచ్చినందుకు సీఎం చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ కొండపి నియోజకవర్గ రైతులు ఆదివారం పెద్దఎత్తున ట్రాక్టర్‌లతో ర్యాలీ నిర్వహించారు. జరుగుమల్లి మండలం కామేపల్లి నుంచి చిర్రికూరపాడు వరకూ 10 కి.మీ ఇది సాగింది. మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొన్నారు.



మంత్రి స్వామి, సత్యలను సన్మానిస్తున్న గ్రామస్థులు

వైభవంగా పోలేరమ్మకు పొంగళ్లు

● మంత్రి స్వామి, సత్య ప్రత్యేక పూజలు

సింగరాయకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాతసింగరాయకొండ పంచాయతీ పరిధిలోని గౌదగట్లవారిపాలెంలో ఆదివారం పోలేరమ్మతల్లికి వైభవంగా పొంగళ్ల కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు పెద్దఎత్తున అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, మారిటైంబోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని గ్రామస్థులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేల్పుల సింగయ్య, టీడీపీ నేతలు గాలి హరిబాబు, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు, చీమకుర్తి కృష్ణ, సన్నెబోయిన శ్రీనివాసులు, సవిడిబోయిన మురళి, పిగిలి భాస్కర్, హరికృష్ణ పాల్గొన్నారు.



ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేస్తున్న డీపీవో వెంకటనాయుడు, ఎంపీడీవో రామకృష్ణ

పంచాయతీ ఎన్నికలపై ఫిర్యాదు

● కలెక్టర్ ఆదేశాలతో డీపీవో విచారణ

కొండపి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా అన్యాయం జరిగిందని మాజీ మంత్రి సురేష్ రాష్ట్ర ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఈనేపథ్యంలో ఆదివారం డీపీవో జి.వెంకటనాయుడు కొండపిలోని ఎంపీడీవో కార్యాలయంలో విచారణ చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల అధికారులకు, మాజీ మంత్రి సురేష్‌కు, అభ్యంతరం లేవనెత్తిన సర్పంచ్ అభ్యర్థి పల్లె మేరీకి ఆమేరకు ముందుగా నోటీసులు ఇచ్చారు. ఆదివారం విచారణకు ఎన్నికల అధికారులు హాజరు కాగా, మిగతావారు హాజరు కాలేదు. ఆమేరకు కలెక్టర్ విచారణ నివేదిక అందజేస్తానని డీపీవో తెలిపారు.

250 మందికి కంటి వైద్య పరీక్షలు

నాగులుప్పలపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మాజీ సర్పంచ్ కామ్రేడ్ మాదాసు కృష్ణమూర్తి 17 వ వర్ధంతి సందర్భంగా ఉప్పుగుండూరు గ్రామంలో మాదాసు కృష్ణమూర్తి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదకాకాని శంకర కంటి వైద్యశాల, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది.శిబిరంలో వైద్యులు 250 మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి 148 మందికి ఆపరేషన్‌లు అవసరమని గుర్తించి ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అమరా వెంకట సుబ్బారావు, ఓరుగంటి మురళీ, మాదాసు రాంబాబు, మాదాసు నాగేశ్వరావు, లచ్చంశెట్టి శ్రీరాములు,పెంట్యాల శ్రీనివాసరావు, మాదాసు మధు, మాదాసు లీలావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యలో సుబ్బారావు సేవలు ఎనలేనవి

ఒంగోలు విద్య, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియెట్ విద్యలో వివిధ హోదాల్లో పనిచేసిన వీవీ సుబ్బారావు ఎనలేని సేవలు అందించారని పలువురు కొనియాడారు. ఇంటర్మీడియెట్ విద్యా మండలి పరీక్షల నియంత్రణ అధికారిగా, నెల్లూరు డీఈఐవోగా పనిచేసి గతనెల 31న ఉద్యోగ విరమణ చేసిన సుబ్బారావును ఆదివారం స్థానిక ఏకేవీకే కళాశాలలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా ఆర్‌జేడీ జే పద్మ, పరీక్షల నియంత్రణ అధికారి సైమన్ విక్టర్, ఓఎస్‌డీ రమేష్‌లు సుబ్బారావు సేవలను కొనియాడారు. ఈసందర్భంగా సుబ్బారావును ఘనంగా సత్కరించారు. జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి కే ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యాధికారులు, ప్రాంతీయ పర్యవేక్షణాధికారులు, ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది ఉన్నారు.

టైలర్స్ సంఘం నగర కమిటీ ఎన్నిక

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఒంగోలు నగర నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. స్థానిక కాశీం బిల్డింగ్స్‌లో ఏర్పాటుచేసిన కార్యవర్గ సమావేశంలో నూతన అధ్యక్షుడిగా ఎస్‌కే. కాశీం, ఉపాధ్యక్షుడిగా బి. శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే. హల్తాఫ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



ఒంగోలు కర్నూల్ రోడ్డులోని సాగర్ లాడ్జి వద్ద మద్యం సేవించి రోడ్డుపై పడిపోయిన మందుబాబుల ముఖంపై నీరు పోసి మత్తు వదిలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మద్యం మత్తులో!

● పూటుగా తాగి రోడ్డుపైనే సేద తీరిన మందుబాబులు
● నీరు పోసి మత్తు వదిలించిన ట్రాఫిక్ పోలీసులు

ఒంగోలు క్రైం,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): మద్యం పూటుగా సేవించి రోడ్డుపైన సేద తీరుతున్న మందు బాబులకు ట్రాఫిక్ పోలీసులు మత్తు వదిలించారు. ఆదివారం స్థానిక సాగర్ సెంటర్ వద్ద మద్యం సేవించిన ఇరువురు రోడ్డు పక్కన పడుకొని మత్తులో ఉండగా విధినిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీసులు వారిని లేపి ముఖం కడిగించి మంచినీరు తాపి ఇంటికి పంపించారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉన్న ప్రైవేటు ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సూర్యారావు కోరారు. ప్రైవేటు టీచర్స్ లెక్చరర్స్, ప్రొఫెసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లాకమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మంగమూరు రోడ్డులోని శ్లోక ట్యూషన్‌సెంటర్‌లో జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షుడు వై. సాంబశివరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో సూర్యారావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు రెండున్నర లక్షల మంది ప్రైవేటు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, వారికి కనీస గుర్తింపు కార్డులు కూడా లేనిపరిస్థితి ఉందన్నారు. కనీస వేతనాలు కూడా లేని దుస్థితి నెలకొందన్నారు. సమస్యల పరిష్కారంకోసం ఐక్యంగా కలిసి పనిచేయాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర నాయకులు ఎస్. రవి మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రైవేటు ఉపాధ్యాయుల బోధనలో, ఫలితాల్లోనూ వ్యత్యాసమే లేనప్పటికీ వేతనాలలో మాత్రం చాలా తేడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైఫీ జిల్లా కార్యదర్శి కేఎఫ్‌బాబు, యూనియన్ నాయకులు టి. రమణ, యు. కిరణ్ తదితరులు ఉన్నారు.

మర్రిపూడి, చిమట సొసైటీలకు అధ్యక్షుల నియామకం

మర్రిపూడి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత మండలంలోని మర్రిపూడి, చిమట సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు వెలువడ్డాయి. మండల టీడీపీలో ఒకవైపు సీనియారిటీకి ప్రాధాన్యతను ఇస్తూ మరోవైపు యువతకు పెద్దపీట వేశారు. మర్రిపూడి సహకార సంఘం అధ్యక్షుడిగా పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న నేతగా గుర్తింపు పొందిన యర్రమోతు శ్రీనివాసులుకు పదవిని కట్టబెట్టారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు యర్రంరెడ్డి వెంకటరెడ్డి, అగ్రహారం గ్రామానికి చెందిన ఎస్సీ సెల్ నాయకుడు రాచపూడి ఇసాక్ సభ్యులుగా నియమితుల య్యారు. మరోవైపు చిమట సహకార సంఘానికి రామాయపాలెంకు చెందిన యువనేత ప్రముఖ రియల్టర్ మలసాని కోటేశ్వరరావును అధ్యక్షునిగా ఎంపిక చేశారు. ధర్మవరంకు చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు గోపిరెడ్డి ఓబుల్‌రెడ్డి, చిమటకు చెందిన కొప్పర్తి కోటిరెడ్డిలను సభ్యులుగా నియమించారు.



యర్రమోతు శ్రీనివాసులు (మర్రిపూడి)



మలసాని కోటేశ్వరరావు (చిమట)

బ్యారన్‌కు 7 బేళ్లు వేలంకు తీసుకురావాలి

ఒంగోలు(రూరల్)ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): కోటాలో మిగిలి ఉన్న రైతులు ప్రతి బ్యారన్‌కు 7బేళ్ల వేలానికి తీసుకురావాలని ఒంగోలు రెండో పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జె.తులసి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వతేదీ సర్వేరెడ్డిపాలెం , కొత్తమామిడిపాలెం,చెరువుకొమ్ముపాలెం, వెంగముక్కపాలెం, యరజర్ల, పోతవరం, 13వతేదీన ప్రాసంగులపాడు ,అనుబ్రోలువారిపాలెం, ఉప్పుగుండూరు, కేశినేనివారిపాలెం, ఒంగోలు, కొప్పోలు, చదలవాడ, సూరారెడ్డిపాలెం, గుత్తికొండవారిపాలెం పొగాకు రైతులు వారి బ్యారన్ కోటాలో ఇప్పటికీ అమ్మకాలు పూర్తి కాని రైతులు మాత్రమే 7 బేళ్ల తీసుకురావాలని వేలం నిర్వహణాధికారి సూచించారు.

13న ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లతో ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న చుండూరి రంగారావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టే మోదీ విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 13న ఒంగోలులో ట్రాక్టర్,మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరి రంగారావు తెలిపారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానికి రైతు సంఘం అధ్యక్షుడు జయంతి బాబు అధ్యక్షత వహించారు.

ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్విట్ ఇండియా స్ఫూర్తితో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ చేస్తూ రైతులను రోడ్డున పడేస్తున్నారన్నారు. రైతులు పండించినపంటలకు గిట్టుబాటు ధరలు కూడా లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఉద్యమం సమయంలోరైతులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయని దుస్థితి నెలకొందన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 13న స్థానిక మినీస్టేడియంనుంచి అద్దంకి బస్టాండు వరకు ట్రాక్టర్, మోటార్ సైకిల్ ప్రదర్శన జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ సైదా, వివిధ సంఘాల నాయకులు చిట్టిపాటి వెంకటేశ్వర్లు, కే హనుమంతరావు, కే లలితకుమారి, కే సుబ్బారావు, జీవీ కొండారెడ్డి, ఇరిగినేని వెంకట నరసయ్య తదితరులు ఉన్నారు.

శిద్దా పుట్టిన రోజున పలు సేవా కార్యక్రమాలు

చీమకుర్తి,ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పుట్టినరోజు వేడుకలు చీమకుర్తి పట్టణంలోని హరిహరక్షేత్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శిద్దా రాఘవరావు, సతీమణి శిద్దా లక్ష్మీపద్మావతి,తనయుడు శిద్దా సుధీర్‌కుమార్ కుటుంబసభ్యులు,అభిమానుల సమక్షంలో కేక్‌కట్ చేశారు.ఈ సందర్భంగా గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ గిరిబాబు, టీడీపీ నాయకులు కాట్రగడ్డ రమణయ్య ఆధ్వర్యంలో పలుసేవా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపాల్టీ పారిశుధ్య కార్మికులకు రక్షణ పరికరాలు పంపిణీ, దివ్యాంగులకు దుస్తులు, మొక్కలు,గొడుగులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమలో శిద్దా సూర్యప్రకాశరావు,పల్లపోతు వెంకటేశ్వర్లు, బొమ్మిశెట్టి మధుసూదనరావు, మారం వెంకారెడ్డి, బొమ్మిశెట్టి కిరణ్, మండవ శ్రీను, మండవ గోపి, మన్నం ప్రసాద్,రావిపాటి రాంబాబు, నూకల సురేంద్ర గ్రానైట్ యజమానులు,ఆర్యవైశ్యసంఘ ప్రతినిధులు,వాసవి మహిళలు పాల్గొన్నారు.



కాస్మెటిక్ సామగ్రిని అందజేస్తున్న శిద్దా రాఘవరావు దంపతులు

ఘనంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) :భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జన్మదిన వేడుకలు ఒంగోలులో ఆదివారం ఘనంగా జరిగాయి. ముందుగా పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర మహిళా నాయకురాలు జిల్లెళ్లమూడి రమాదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను పార్టీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు,మాజీ అధ్యక్షులు పీవీ శివారెడ్డి, పీవీ కృష్ణారెడ్డిలు కట్‌చేశారు. అనంతరం గద్దలగుంటలోని వృద్ధాశ్రమంలో 50 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొద్దులూరి అంజనేయులు, అమరసింగం, పొదా అపర్ణ, రాధాకృష్ణ, శ్రీనివాస్ చౌదరి, శివాజీ యాదవ్, రావుపల్లి నాగేంద్రయాదవ్, కొమ్ము శ్రీనివాసులు, సీతారామయ్య, అనిల్, రాజేష్ వర్మ, సంజయ్ కుమార్, దండు శ్రీను, హరికృష్ణ, తిరుమలరావు తదితరులు ఉన్నారు.

జాతీయ అథ్లెటిక్స్‌కు సింగరాయకొండ విద్యార్థిని

సింగరాయకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు జిల్లా అక్షర విద్యాలయంలో ఐదురోజులుగా నిర్వహిస్తున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 అథ్లెటిక్స్ పోటీల్లో 1500 మీటర్స్, అండర్-17 రన్నింగ్ విభాగంలో సింగరాయకొండకు చెందిన విద్యార్థిని పోకూరి వెంకట సాయి హాశ్విత సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. దీంతో సెప్టెంబర్ నెలలో వారణాసిలో నిర్వహించే జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించింది.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

కొండపి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెట్లూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఓఎల్‌టీసీ ఫిర్యాదు రావడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న ట్రాన్స్‌కో కంపెనీ సిబ్బంది ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు శ్రమించి మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. పెట్లూరు సబ్‌స్టేషన్ సిబ్బంది కూడా కార్యక్రమంలో పాల్గొన్నారని విద్యుత్‌శాఖ మండల ఏఈ పి.శ్రీనివాసులు తెలిపారు.

ప్రజాప్రభుత్వంలో అన్నదాత సుఖీభవ

- రైతు సంక్షేమం కోసం సీఎం చంద్రబాబు కృషి
- సాగు పెట్టుబడికి నిధులు
- రాయితీతో యంత్ర పరికరాలు
- బిందు, ప్రకృతి సేద్యాలకు ప్రోత్సాహం
- మంత్రి స్వామి, సత్య
- భారీగా ట్రాక్టర్లతో ర్యాలీలో పాల్గొన్న రైతులు

జరుగుమల్లి/కొండపి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మునుపెన్నడూ లేనివిధంగా పెట్టుబడి నిధులు, రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి చెప్పారు. రైతులు ఆదివారం సాయంత్రం కామేపల్లి నుంచి చిర్రికూరపాడు వరకు పది కిలోమీటర్లు దూరం ట్రాక్టర్లతో నిర్వహించిన అన్నదాత సుఖీభవ కృతజ్ఞతా ర్యాలీలో మంత్రి స్వామి, ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలు పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం చిర్రికూరపాడు గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో జరిగిన సభలో మంత్రి మాట్లాడారు. రైతులకు అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ పథకం ద్వారా తొలి విడత నిధులు ఏడు వేల రూపాయలు సకాలంలో రైతులకు అందించామన్నారు. రాయితీపై ట్రాక్టర్ అనుబంధ యంత్ర పరికరాలు, డ్రిప్ పైపులు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య మాట్లాడుతూ నియోజకవర్గంలోని 36,808 మంది రైతులకు అన్నదాత సుఖీభవ కింద దాదాపు 25 కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందన్నారు. ర్యాలీకి ముందుగా కామేపల్లిలోని బస్టాండ్ సెంటర్‌లోని దివంగత సీఎం ఎన్టీఆర్, దివంగత మంత్రి దామచర్ల ఆంజనేయులు విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, నాయకులు దగ్గుమాటి సుబ్బారెడ్డి, నలమోతు వెంకటేశ్వర్లు, కొమ్మాలపాటి కృష్ణ, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, చదలవాడ బ్రహ్మేంద్రం, బీజేపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.


ట్రాక్టర్ నడుపుతున్న మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య, పక్కన మంత్రి స్వామి

200 ట్రాక్టర్లతో భారీగా ర్యాలీ...

కామేపల్లిలోని జడ్పీస్కూల్ నుంచి దాదాపు 200 ట్రాక్టర్లతో రైతులు భారీగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి ముందు భాగాన మినీ ట్రాక్టర్‌ను ఏపీ మారిటైంబోర్డు చైర్మన్ దామచర్ల సత్య నడపగా పక్క సీట్లో మంత్రి స్వామి కూర్చుని ర్యాలీలో అగ్రభాగాన సాగారు.

సొసైటీలకు పీఏసీ కమిటీల నియామకం



జిల్లాలో 50 సహకార పరపతి సంఘాలకు చైర్మన్లు, సభ్యుల నియామకం

ఒంగోలు కలెక్టరేట్,ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 50 ప్రాథమిక వ్యవసాయసహకార సంఘం(పీఏపీఎస్)పీఐసీ కమిటీలను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. **సర్వేరెడ్డిపాలెం సొసైటీకి పీఐసీ చైర్మన్‌గా** కామేపల్లి సీతారామయ్య, సభ్యులుగా మక్కెన శ్రీనివాసులు, జి. కృష్ణ, **కొణిజేడు సొసైటీకి పీఐసీ చైర్మన్‌గా** రామకామయ్య, సభ్యులుగా పొనుగుమాటి శ్రీనివాసరావు, గుమ్మా శ్రీనివాసరావులు, **పొన్నలూరు సొసైటీకి చైర్మన్‌గా** ఉన్నం కొండలరావు, సభ్యులుగా భూమిరెడ్డి ఏరుకులరెడ్డి, లింగంగుంట బ్రహ్మయ్య, **మన్నేపల్లి సొసైటీకి చైర్మన్‌గా** గంది రమణారెడ్డి, సభ్యులుగా కే శ్రీనివాసరావు, ఎన్.వీరరాఘవులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. **కూనంనేనివారిపాలెం సొసైటీ చైర్మన్‌గా** వై లక్ష్మీనరసయ్య, సభ్యులుగా కే కోటేశ్వరరావు, దర్శి సుబ్బారావు, **పల్లామల్లి సొసైటీ చైర్మన్‌గా** పారా చంద్రశేఖర్, సభ్యులుగా పత్తి అంజయ్య, ఎస్.జాన్సన్, **దొడ్డవరం సొసైటీ చైర్మన్‌గా** మార్నినేని సుబ్బారావు, సభ్యులుగా డి.శ్రీరామగోపాలరాజు, సీహెచ్ శ్రీనివాసులు, **కందలగుంట సొసైటీ చైర్మన్‌గా** ఎం. వున్నారెడ్డి, సభ్యులుగా ఎ.కోటేశ్వరరావు, డి. వెంకటరావు, **ఏడుమూడి సొసైటీ చైర్మన్‌గా** కే విజయలక్ష్మీ, సభ్యులుగా సీహెచ్ వెంకటేశ్వర్లు, సీహెచ్ కోటేశ్వరరావులు నియమితులయ్యారు. **కరవది సొసైటీ చైర్మన్‌గా** పోలవరపు శ్రీనివాసరావు, సభ్యులుగా చిల్లర హనుమంతరావు, పి.చెంచురామయ్య, **కొండపి సొసైటీ చైర్మన్‌గా** రావెళ్ల వెంకట రఘునాథబాబు, సభ్యులుగా మూల రామిరెడ్డి, ఎం.వెంకటేశ్వరరావు, **కొత్తపట్నం సొసైటీ చైర్మన్‌గా** డి. శ్రీనివాసులు, సభ్యులుగా కే తిరుపతిరావు, బి. సుబ్బచంద్రబోస్, **కనుమళ్ల సొసైటీ చైర్మన్‌గా** బి. మోహన్‌రావు, సభ్యులుగా కే రంగారావు, ఎన్. వెంకటేశ్వర్లు, **ఎం.నిడమానూరు సొసైటీ చైర్మన్‌గా** ఎం. హరిబాబు, సభ్యులుగా ఎన్. రామచంద్రరావు, బి. మధుసూదనరావు, **టంగుటూరు సొసైటీ చైర్మన్‌గా** మక్కెన హరిబాబు, సభ్యులుగా కే వెంకటేశ్వర్లు, వై. సుధాకర్‌బాబు, **వల్లూరు సొసైటీ చైర్మన్‌గా** దామచర్ల పూర్ణచంద్రరావు, సభ్యులుగా ఎ. ప్రసాద్, బెజవాడ శ్రీనివాసరావులు నియమితులయ్యారు. **పచ్చవ సొసైటీ చైర్మన్‌గా** టి. బ్రహ్మయ్య, సభ్యులుగా ఎం. రామిరెడ్డి, పి. రమేష్‌బాబు, **నందనవనం సొసైటీ చైర్మన్‌గా** స్వర్ణ సుధాకరరావు, సభ్యులుగా ఆర్. జాలపతి, సీహెచ్ మురళీకృష్ణ, **జరుగుమల్లి సొసైటీ చైర్మన్‌గా** నల్లమోతు వెంకటేశ్వర్లు, సభ్యులుగా కే బలరామిరెడ్డి, ఆర్, రామకోటయ్య, **చిర్రికూరపాడు సొసైటీ చైర్మన్‌గా** జి. వెంకటేశ్వర్లు, సభ్యులుగా పి. వెంకటేశ్వర్లు, కే రామారావు చౌదరి, **ముప్పాళ్ల సొసైటీ చైర్మన్‌గా** ఎం.రామయ్య, సభ్యులుగా డి. వెంకటరామిరెడ్డి, చల్లా శ్రీనివాసరెడ్డి, **చెరుకూరు సొసైటీ చైర్మన్‌గా** వి.మాల్యాద్రి, సభ్యులుగా కే మాల్యాద్రి, ఎం. ఆదెయ్య, **ముప్పాలపాడు సొసైటీ చైర్మన్‌గా** కే నారాయణరెడ్డి, సభ్యులుగా వీ రాజేష్, కే బాలనారాయణ, **కనిగిరి సొసైటీ చైర్మన్‌గా** అద్దంకి రంగబాబు, ఎం.వెంకటసుబ్బయ్య, ఎస్‌కే పేర్ల బ్రహ్మయ్య, **లింగారెడ్డిపల్లి సొసైటీ చైర్మన్‌గా** కే చిన్న వెంకటేశ్వర్లు, సభ్యులుగా ఆర్ రమేష్, ఎన్. నరేష్‌లు నియమితులయ్యారు. **ఉప్పలపాడు సొసైటీ చైర్మన్‌గా** యు. వెంకటగోపి, వి.రమణారెడ్డి, వి. మోహన్‌రావులు నియమితులయ్యారు. **మాదాలవారిపాలెం సొసైటీ చైర్మన్‌గా** వై.వెంకటేశ్వరరెడ్డి, సభ్యులుగా బి.ఓబయ్య, పి. వెంకటేశ్వర్లు, **చిమట సొసైటీ చైర్మన్‌గా** ఎం. కోటేశ్వరరావు, సభ్యులుగా కే కోటిరెడ్డి, జి. ఓబుల్‌రెడ్డి, **మర్రిపూడి సొసైటీ చైర్మన్‌గా** వై. శ్రీనివాసరావు, సభ్యులుగా వై.వెంకటరెడ్డి, ఆర్.ఇస్సాక్, **చిన్నారికట్ల సొసైటీ చైర్మన్‌గా** ఎస్.వెంకటేశ్వరరెడ్డి, సభ్యులుగా వి. తిరుమలయ్య, ఎం. వెంకటేశ్వర్లు, **రేగడపల్లి సొసైటీ చైర్మన్‌గా** కే నరసింహారావు, సభ్యులుగా ఎ. వెంకటేశ్వరరెడ్డి, ఎస్. కాశిరెడ్డి, **తర్లుపాడు సొసైటీ చైర్మన్‌గా** వి.క్రాంతికుమార్, సభ్యులుగా పి.వెంకటేశ్వర్లు, టి.కోటిరెడ్డి, **కంభాలపాడు సొసైటీ చైర్మన్‌గా** వి. చెన్నయ్య, సభ్యులుగా జి.అంకిరెడ్డి, జే పెదబ్రహ్మయ్యలు నియమితులయ్యారు. **నమశ్శివాయపురం సొసైటీ చైర్మన్‌గా** కే చిన్నవెంగయ్య, సభ్యులుగా కే రామయ్య, ఎస్. చిన్నదేవయ్య, **వెస్టువీరాయపాలెం సొసైటీ చైర్మన్‌గా** ఎం. నాగేశ్వరరావు, సభ్యులుగా జి.వెంకటపతి, ఎన్.పోలయ్య, **కురిచేడు సొసైటీ చైర్మన్‌గా** పి. సీతారామయ్య, సభ్యులుగా పీ చిరంజీవి, సీహెచ్ శ్రీనివాసరెడ్డి, **మారెళ్ల సొసైటీ చైర్మన్‌గా** బి.అంజయ్య, సభ్యులుగా టి. వెంకటేశ్వర్లు, జి. సాయిబాబు, **ముండ్లమూరు సొసైటీ చైర్మన్‌గా**వీరనారాయణ,సభ్యులుగా బి. వెంకట్రావు, ఎ. కృష్ణారెడ్డి, **ఉమామహేశ్వరపురం సొసైటీ చైర్మన్‌గా** కే గురవయ్య, సభ్యులుగా ఎం. శ్రీనివాసరావు, బి. హనుమంతరావు, **బొప్పిడివారిపాలెం సొసైటీ చైర్మన్‌గా** కే రామాంజనేయులు సభ్యులుగా ఎ.నరసింహారావు, సీహెచ్ శ్రీనివాసరావు, **నాగంబొట్లపాలెం సొసైటీ చైర్మన్‌గా** వి. చిన్నసుబ్బారావు, సభ్యులుగా ఎస్.కోటిరెడ్డి, బి.ఆదినారాయణ, **మార్కాపురం సొసైటీ చైర్మన్‌గా** జే రామాంజనేయరెడ్డి, సభ్యులుగా టి. చిన్నవెంకటరెడ్డి, వై.వెంకటకోటిరెడ్డి, **మిట్టమీదపల్లి సొసైటీ చైర్మన్‌గా** జి.నరసారెడ్డి, సభ్యులుగా డి.హుస్సేన్, టి.వెంకటేశ్వరరెడ్డి, **పెద్దారవీడు సొసైటీ చైర్మన్‌గా** సీహెచ్‌రాజేశ్వరరెడ్డి, సభ్యులుగా ఎ. ప్రసాద్ సుంకల, వి. సుబ్బారెడ్డి, **పుల్లలచెరువు సొసైటీ చైర్మన్‌గా** పి. రామిరెడ్డి, ఎన్. వెంకటరామిరెడ్డి, పి. పెద్ద కోండాలిలు నియమితులయ్యారు. **త్రిపురాంతకం సొసైటీ చైర్మన్‌గా** జి. వెంకటనారాయణ, సభ్యులుగా పీ అచ్చయ్య, బి. నాగరాజు, **రాచర్ల సొసైటీ చైర్మన్‌గా** జి. జీవనేశ్వరరెడ్డి, సభ్యులుగా బి. రాజశేఖర్, జి. పిచ్చయ్య. **కంభం సొసైటీ చైర్మన్‌గా** కే శ్రీనివాసులు, సభ్యులుగా కే బాల కోటయ్య, ఎస్.వరలక్ష్మీ, **బేస్తవారిపేట సొసైటీ చైర్మన్‌గా** డి.వెంకటరమణారెడ్డి, సభ్యులుగా ఎం.రామయ్య, ఎస్. చెన్నమ్మ, **గలిజరుగుళ్ల సొసైటీ చైర్మన్‌గా** జి. నరసింహ, సభ్యులుగా కే సుబ్బారెడ్డి, ఎస్. అబ్దుల్‌ఖైలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.


ఒంగోలు నగరంలో పట్టిన మబ్బు

తగ్గిన ఎండల తీవ్రత

చల్లబడిన వాతావరణం

నాలుగైదు డిగ్రీల ఉష్ణోగ్రతలు తగ్గడంతో ప్రజలకు ఉపశమనం

ఒంగోలు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వాతావరణంలో మార్పు వచ్చింది. ఎండల తీవ్రత కొంత మేర తగ్గింది. అత్యధిక ప్రాంతాల్లో వాతావరణం చల్లబడింది. దీంతో వర్షం పడుతుందన్న ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. జిల్లాలో దాదాపు నెలన్నరగా ఎండల తీవ్రత అధికంగా ఉంది. ఒకట్రెండ్రోజులు కొన్నిచోట్ల జల్లులు పడినా అత్యధిక ప్రాంతాల్లో ఎండలు మండిపోయాయి. సాధారణంగా ఈ సమయంలో 32నుంచి 35 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. మధ్యాహ్నం వరకు అలా ఒక మోస్తరు ఎండలు, తర్వాత మబ్బులు పట్టి వాతావరణం చల్లబడటం, సాయంత్రానికి జల్లులు పడటం జరుగుతుంటుంది. అయితే ఈ ఏడాది అందుకు భిన్నమైన వాతావరణం ఏర్పడింది. వాన జాడ లేకపోవడమే కాక ఎండల తీవ్రత అధికంగా ఉంది. ఒక రకంగా వేసవిని తలపించింది. అధిక ప్రాంతాల్లో 37నుంచి 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఆపై ఉక్కపోత, వేడిగాలులు వీయడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ పరిస్థితి పంటల సాగుకు ప్రతిబంధకంగా మారింది. వేసిన పైర్లు కూడా వాడుముఖం పట్టి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఆదివారం జిల్లావ్యాప్తంగా వాతావరణం చల్లబడింది. ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఒంగోలులో రెండు రోజుల క్రితం 38 డిగ్రీలు గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా ఆదివారం అది 33.90డిగ్రీలుగా ఉంది. ఇతర ప్రాంతాల్లోనూ అలాగే ఉష్ణోగ్రతలు తగ్గడమే కాక ఉక్కపోత నుంచి కూడా ఉపశమనం లభించింది. చాలా ప్రాంతాల్లో ఆకాశంలో మబ్బులు కమ్మాయి. తాజా వాతావరణ పరిస్థితితో వర్షాలు పడతాయన్న ఆశ ప్రజల్లో కనిపిస్తోంది. వర్షం కురిస్తే పంటల సాగుకు మేలు జరుగుతుందని రైతులు ఆశపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి


నడిరోడ్డుపై విగతజీవుడై పడిఉన్న ధనుంజయరావు

పంగులూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఈ ఘటన 16వ నంబరు హైవేపై ఆదివారం తెల్లవారుజామున అలవలపాడు అడ్డరోడ్డు సమీపంలో చోటుచేసుకొంది. హైవే అంబులెన్స్ సిబ్బంది అందించిన వివరాలు ఇలా... ఇంకొల్లు మండలం హనుమోజీపాలెం గ్రామానికి చెందిన అత్తులూరి ధనుంజయరావు(58) ఆయన భార్య మహోన్నతితో కలిసి శనివారం బైక్‌పై కొరిశపాడు మండలం బొడ్డువానిపాలెంలో బంధువుల ఇంట శుభకార్యానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో అలవలపాడు అడ్డరోడ్డుకు చేరుకునేందుకు రోడ్డు దాటుతున్నారు. ఈ క్రమంలో చిలకలూరిపేటవైపు నుంచి ఒంగోలువెళుతున్న కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ధనుంజయరావు ఘటనా స్థలంలో మృతిచెందగా, భార్యకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలిని ఒంగోలు వైద్యశాలకు తరలించారు. ధనుంజయరావు ఈపురుపాలెం పాఠశాలలో టీచర్‌గా పనిచేస్తున్నారు.

బుక్‌లెట్లతో ప్రయోగాత్మకంగా పరీక్షలు

1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మారిన ప్రశ్నపత్రం నమూనా

ఎంఈవోలపై ఆర్‌జేడీ ఆగ్రహం

నేటి నుంచి ఎఫ్ఏ1 ఎగ్జామ్స్

జిల్లాకు 13.37 లక్షల అసెస్‌మెంట్ పుస్తకాలు

ఒంగోలు విద్య, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి ప్రారంభం కానున్న ఫార్మేటివ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్-1 పరీక్షలను ప్రయోగాత్మకంగా బుక్ లెట్లలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు వీటిని నిర్వహించనున్నారు. విద్యాసంవత్సరంలో నిర్వహించే నాలుగు ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు, రెండు సమ్మిటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు మొత్తం బుక్‌లెట్లలో రాసేవారు. మారిన విధానంలో ప్రతి సబ్జెక్టుకు ఒక అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను అందజేస్తున్నారు. ఉమ్మడి జిల్లాకు 13,37,231 అసెస్‌మెంట్లు వచ్చాయి.

మార్కుల కేటాయింపులోనూ మార్పులు

నిరంతర సమగ్ర మూల్యాంకనం(సీసీఈ) విధానంలో ఫార్మేటివ్ అసెస్‌మెంట్(ఎఫ్ఏ1) పరీక్ష ప్రశ్నాపత్రం మారింది. గతంలో 50 మార్కుల్లో 10మార్కులు విద్యార్థుల ప్రతి స్పందనకు పది మార్కులు, రాతకు పది మార్కుల పోను మిగిలిన 20 మార్కులకు పరీక్ష నిర్వహించేవారు. ప్రస్తుతం దానిని మార్పులు చేసి ప్రతిస్పందనకు ఐదు, రాత పనికి ఐదు, ప్రాజెక్టు పనికి ఐదుపోను మిగిలిన 35 మార్కులకు రాతపరీక్ష నిర్వహిస్తారు. ప్రతి పరీక్షకు ఓఎంఆర్ షీట్ ఇచ్చారు. మార్కులను అందులో నమోదు చేయాలి. పరీక్ష ముగిసి మూల్యాంకనం పూర్తయిన తర్వాత ఓఎంఆర్ షీట్‌ను స్కాన్ చేసి లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రస్తుతం ఎఫ్ఏ1 పరీక్షకు మాత్రం ఓఎంఆర్‌ను స్కాన్‌చేసి లీప్ యాప్‌లో అప్‌లోడ్ చేసేందుకు మినహాయింపు ఇచ్చారు.



కొత్త బుక్ లెట్

కొన్ని మండలాలకు పుస్తకాలు అందకపోవడంపై అసహనం

సోమవారం నుంచి విద్యార్థులకు పరీక్ష ప్రారంభమవుతుండగా కొన్ని మండలాలకు పూర్తి స్థాయిలో పుస్తకాలు అందకపోవడంపై ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. కొన్ని మండలాల్లో వందల సంఖ్యలో పుస్తకాలు గుట్టలుపడిఉండగా కొన్ని మండలాల్లో వందల సంఖ్యలో పుస్తకాలు కొరత ఏర్పడింది. పరిస్థితిని గమనించిన ఆర్‌జేడీ ఆదివారం డీఈవో, డీవైఈవో, ఎంఈవోలతో నిర్వహించిన వెబెక్స్‌లో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏ మండలాల్లో మిగులు ఉన్నాయి, ఎక్కడ కొరత ఉందో తెలుసుకొని మిగిలిన పుస్తకాలను కొరత ఉన్న మండలాలకు సర్దుబాటు చేయాలని ఆదేశించారు. దీంతో ఆదివారం సాయంత్రానికి ఈ కార్యక్రమం పూర్తికావడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

పరీక్షల పర్యవేక్షణకు నాలుగు కమిటీలు

జిల్లాలోని పాఠశాలల్లో సోమవారం నుంచి జరగనున్న అసెస్‌మెంట్ పరీక్షల నిర్వహణను పర్యవేక్షించేందుకు నాలుగు కమిటీలను ఏర్పాటు చేస్తూ డీఈవో కిరణ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రతి కమిటీలో ఇద్దరు ఎంఈవోలను నియమించారు. ఈ కమిటీలు తమకు కేటాయించిన మండలాలను వెంటనే సందర్శించాలి. వీరికి కేటాయించిన మండలాల్లో మిగులు, కొరతను గుర్తించి అసెస్‌మెంట్ పుస్తకాలను సరస్దుబాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు

శాస్త్రీయ సమాజం ఏర్పాటు కావాలి

గిద్దలూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : శాస్త్రీయ సమాజ ఏర్పాటులో తమ సంస్థ చేస్తున్న కృషిలో అందరూ భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.మురళీధర్ చెప్పారు. ఎస్ఎస్‌ప్లాజాలో 2వ రోజు ఆదివారం జేవీవీ జిల్లా 18వ మహాసభల ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషిలో భాగస్వాములు కావాలని, ఉపాధ్యాయులు, డాక్టర్లు, మేధావులు, ఆలోచనాపరులు, సైన్స్ అభిమానులను కోరారు. జేవీవీ సీనియర్ నాయకులు డాక్టర్ భూమా నరసింహారెడ్డి మాట్లాడుతూ శాస్త్ర ప్రచారాన్ని గ్రామ స్థాయికి తీసుకు వెళ్లాల్సిన అవసరాన్ని వివరించారు. జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.స్వరూపారెడ్డి మాట్లాడుతూ మూఢనమ్మకాల నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, అందరికీ విద్య, మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చేందుకు విద్యావంతులు చొరవ తీసుకోవాలన్నారు. ఈనెల 15 నుంచి 24వ తేదీ వరకు విజయవాడ బుక్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో ఒంగోలులోని పీవీఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఫుడ్‌ఫెస్టివల్‌లో పాల్గొనాలని కోరారు. సమావేశంలో జేవీవీ రాష్ట్ర కమిటీ సభ్యులు జయప్రకాశ్, భాస్కర్, శోభన్‌కుమార్, సుబ్రమణ్యాచారి పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న జేవీవీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్

నూతన కార్యవర్గం ఎన్నిక

జేవీవీ జిల్లా 18వ మహాసభల సందర్భంగా జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర కమిటీ నాయకులు పి.స్వరూపారెడ్డి ప్రకటించారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ బీ జవహర్, డాక్టర్ బీ హరిబాబు, డాక్టర్ టి.చెన్నక్రిష్ణ, ప్యాట్రన్స్‌గా ఏవీ పుల్లారావు, కే సుబ్రమణ్యాచారి, జిల్లా శాఖ అధ్యక్షుడిగా యు.వెంకటరావు, ప్రధాన కార్యదర్శిగా జీ శ్రీనివాసరెడ్డి, కోశాధికారి బీ తిరుపతయ్య, జిల్లా ఉపాధ్యక్షుడిగా ప్రసాద్, ఖాజాహుస్సేన్, భాస్కర్, వెంకటేశ్వరరావు, మండ్ల శ్రీనివాసులు, గురుస్వామి, కార్యదర్శులుగా దేవప్రసాద్, విశ్వరూపం, వెంకటేష్, బాలునాయక్, రవికుమార్, విద్య ఆరోగ్య కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ బి.శరత్, సమత కన్వీనర్‌గా షేక్ బషీరున్నీసాబేగం, సాంస్కృతిక కమిటీ కన్వీనర్‌గా రమణయ్య, శాస్త్ర సాంకేతిక కమిటీ కన్వీనర్‌గా రంగారెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్‌గా శేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ మాలకొండారెడ్డి, మరో 40 మంది జిల్లా కమిటీ సభ్యులతో నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది.

కోలాహలంగా శిద్దా జన్మదిన వేడుకలు

పెద్ద సంఖ్యలో వచ్చి శుభాకాంక్షలు తెలిపిన అభిమానులు

సేవా కార్యక్రమాల నిర్వహణ

ఒంగోలు కల్చరల్, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాజీ మంత్రి శిద్దా రాఘవ రావు జన్మదిన వేడుకలు ఆదివారం అభిమానుల మధ్య కోలాహలంగా జరిగాయి. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన అభిమానులతో ఒంగోలులోని ఆయన గృహం కిటకిటలాడింది. గోల్డెన్ గ్రానైట్ మేనేజర్ ఏ గిరి, జిల్లా ఆర్యవైశ్య సంఘం, జ్యోతి గ్రానైట్స్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి పలువురు నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా ఆదివారం శిద్దా మనుమడు విహాన్ పుట్టినరోజు కూడా కావడంతో చీమకుర్తి హరిహరక్షేత్రంలో పూజలు నిర్వహించి పెద్ద ఎత్తున జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏ గిరిబాబు, కాట్రగడ్డ రవణయ్య చీమకుర్తి బాషాలు వృద్ధాశ్రమానికి దుప్పట్లు, ఎస్.కె.ఆర్.బధిరుల పాఠశాల విద్యార్థులకు కాస్మొటిక్స్, ప్రభుత్వ పాఠశాల మధ్యాహ్న భోజన పథకానికి కుకింగ్ గ్యాస్ ఏడాది ఖర్చు, మునిసిపల్ కార్మికులకు ఎప్రాన్, చేతి గ్లౌజ్‌లు, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మొక్కలు, నోట్ బుక్స్ పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నగరంలో ఏర్పాటుచేసిన ఒక సాంస్కృతిక కార్యక్రమంలో పాల్గొన్న సుమారు 30 మంది మహిళలకు శిద్దా జన్మదినం, శ్రావణమాసం సందర్భంగా చీరెలు, పసుపు, కుంకుమ పంపిణీ చేశారు.


కేక్ కట్ చేస్తున్న శిద్దా దంపతులు, పక్కన సుధీర్

వివాహిత ఆత్మహత్య

కొండపి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): తన భర్త వ్యసనాలకు బానిసయ్యాడన్న మనస్తాపంతో వివాహిత ఇంటిలో ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది.ఈ ఘటన ఆదివారం ఉదయం 10 గంటల ప్రాంతంలో పెదకండ్లగుంట గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై బి. ప్రేమ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... పెదకండ్లగుంట గ్రామానికి చెందిన పాలపర్తి రాజశ్రీ (29) భర్త వ్యసనానికి బానిసయ్యాడన్న మనస్తాపంతో తన చీరతో ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. సమాచారం అందుకున్న ఎస్సై కేసు నమోదు చేశామని తెలిపారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

- ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి
- నియోజకవర్గంలోని 103 మందికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను అందిస్తూ వారికి ముఖ్యమంత్రి సహాయనిధి భరోసా కల్పిస్తుందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గంలోని 103 మంది లబ్ధిదారులకు రూ.70,42,365 ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అశోక్‌రెడ్డి పంపిణీ చేశారు. ఓ పక్క పేదలకు ఖరీదైన వైద్యం అందిస్తూ ప్రజా సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందని కొనియాడారు. సీఎం సహాయనిధి ద్వారా అర్హులైన పేదలకు ఆర్థిక సాయం అందడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగవుతాయన్నారు. వైద్య రంగంలో అందుబాటులో ఉన్న సేవలు అనేక కుటుంబాలకు ఆసరాగా నిలుస్తున్నాయన్నారు. గత పాలకులు పేదల సంక్షేమాన్ని మరిచి అరాచక పాలన సాగించి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. రాష్ట్రం సంక్షోభంలో ఉన్నా కూడా పేదలకు సంక్షేమం అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు. రాచర్ల మండలానికి చెందిన ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ

ఇద్దరు దివ్యాంగులకు ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ట్రైసైకిళ్లను అందచేశారు. ఆదివారం ఆయన కార్యాలయంలో కంభం మండలం తురిమెళ్ల గ్రామానికి చెందిన దివ్యాంగులు షేక్ దస్తగిరి, మామిళ్ల కోటయ్య ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. భవిష్యత్‌లో మరింత మంది దివ్యాంగులకు సహాయం అందించే దిశగా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రామచంద్రరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి ఉన్నారు.

పేదలకు ఆవోపా ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ

గిద్దలూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఆవోపా ఆధ్వర్యంలో 100 మంది పేద ఆర్య వైశ్య స్త్రీ, పురుషులకు దాతల సహకారంతో దుస్తులను పంపిణీ చేశారు. వాసవీ కల్యాణ మండపం ఆవరణలో ఆదివారం జరిగిన ఈ కార్యక్రమంలో పేదలకు దుస్తులతోపాటు టెన్త్, ఇంటర్‌లో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందచేశారు. ఇటీవలే రిటైర్డ్ అయిన ఉపాధ్యాయులు గొంట్ల వెంకటేశ్వర్లు, సూరె సుబ్బరామయ్యలను ఘనంగా సన్మానించారు.

గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానం

- పెరుగుతున్న దోమల బెడద
- వెంటాడుతున్న రోగాల భయం
- చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు
- అందుబాటులో లేని కార్యదర్శులు



బోయలపల్లి గ్రామంలో మురుగు నీటితో ఉన్న రోడ్డు

ఎర్రగొండపాలెం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంతోపాటు గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తుతాయి. వాన నీరు నిలిచి ఉండడం, పారిశుధ్య చర్యలు లోపించడంతో గ్రామాల్లో దోమల బెడద, రోగాల భయం ప్రజలను వెంటాడుతోంది. ఎర్రగొండపాలెం మండలం వ్యాప్తంగా ఇటీవల వర్షాలు కురుస్తున్నాయి. ఈ వర్షాలు రైతులకు మేలు చేస్తుండగా, ప్రజలకు మాత్రం నరకం చూపుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ మురుగు అక్కడే నిలిచి ఉంటోంది. వైసీపీ పాలనలో గ్రామీణ ప్రాంతాలకు అవసరమైన రోడ్లు, కాలువల నిర్మాణం, చెత్త తొలగించడం, డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడం వంటి పనులేవీ చేయలేదు. దీంతో వానొస్తే మురుగు నీటి తిప్పలు తప్పడం లేదు. రోడ్లు కుంటలను తలపిస్తున్నాయి. ప్రజా ప్రభుత్వం వచ్చాక పలు గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలువల నిర్మాణం, డంపింగ్ యార్డుల నిర్వహణ, గ్రామాల నుంచి చెత్త తరలింపు వంటి పనులు యథావిధిగా జరుగుతున్నాయి. అయితే కొన్ని గ్రామాల్లో పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎక్కడ చెత్త అక్కడే ఉంటుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వానలు కురుస్తుండడంతో మురుగు నీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెంది ప్రజలకు కునుకు లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమ కాటుకు గురై పలువురు రోగాలతో బాధపడుతున్నారని స్థానికులు చెప్తున్నారు. బోయలపల్లి, గురిజేపల్లి, గంజివారిపల్లి, గోళ్లవిడిపి, తమ్మడపల్లి, వైపాలెం గ్రామాలలో పారిశుధ్య చర్యలు లేక రోడ్లపైనా, వీధుల్లో మురుగు నీరు పేరుకపోయిందని ఆయా గ్రామాల ప్రజలు చెప్తున్నారు.

అందుబాటులో ఉండని కార్యదర్శులు

ఇది వానలతోపాటు దోమలకు నిలయంగా మారే కాలం. ఈ సమయాల్లో గ్రామాల్లో ఆందుబాటులో ఉండి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రజలు రోగాలబారిన పడకుండా చూడాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడం కనీసం బ్లీచింగ్ కూడా చల్లకపోవడంతో అధికారులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, కార్యదర్శులు పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



వైపాలెంలో రోడ్లపై నిలిచిన నీటిలో ఇబ్బందులు పడుతున్న చిన్నారి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు బాలరంగారావు

సేవలకు ప్రతిరూపం లయన్స్ క్లబ్

కంభం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ వ్యాప్తంగా అన్నార్థులకు నిష్కలంగా సేవలు అందించడంలో లయన్స్ క్లబ్ ముందుంటుందని తాజా మాజీ గవర్నర్ లయన్ పి.గోపీచంద్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 2025-26 లయనిస్టిక్ సంవత్సరానికి కంభం లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ గవర్నర్ పి.విజయ్‌కుమార్‌రెడ్డి నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. మాజీ గవర్నర్ నామినేని మోహన్‌రావు, తాజా మాజీ కేబినెట్ సెక్రటరీ వి.వెంకటసుబ్బయ్య, జోన్ చైర్మన్ ముత్యాల ప్రసాద్, మాజీ జోన్ చైర్మన్ డాక్టర్ పులి శ్రీనివాసప్రసాద్, మాజీ అధ్యక్షులు బైసాని వెంకట రామక్రిష్ణ ప్రసంగించారు.

నూతన కార్యవర్గం

కంభం లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షునిగా తన్నీరు బాలరంగారావు, కార్యదర్శిగా శిరిగిరి వెంకటరావు, కోశాధికారిగా పేర్లి వెంకటగుండయ్య, ఉపాధ్యక్షులుగా జలపాటి తులసి ప్రసాద్, కేవీ నాగేశ్వరరావు, సంయుక్త కార్యదర్శులుగా జీ సత్యరామారావు, సర్వీస్ కమిటీ చైర్మన్‌గా సయ్యద్ జాకీర్ హుస్సేన్, మొగల్ మహబూబ్‌బేగ్, డైరెక్టర్లుగా పార్శ శంకర్, కాశయ్య, సయ్యద్ మహబూబ్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్‌ఎంయూ నూతన కార్యవర్గం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ఏపీ పీటీడీ నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఈశ్వరమ్మ గుడివద్ద జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎన్‌ఎంయూ డిపో అధ్యక్షుడిగా సీహెచ్ శ్రీనివాసులు, కార్యదర్శిగా పవనం శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా పి.వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హుస్సేన్ సాహెబ్, వెంకటేశ్వర్లు, గ్యారేజీ కార్యదర్శిగా సత్యనారాయణరెడ్డి, ప్రెసిడెంట్‌గా హనీఫ్ ఎన్నికయ్యారు. సమావేశంలో ఎన్‌ఎంయూ నాయకులు ప్రసాద్, అంజయ్య, దస్తగిరి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుని జన్మదిన వేడుకలు

మార్కాపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) :బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా జరిగాయి. స్థానిక జవహర్‌నగర్ కాలనీలో పట్టణ పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముందుగా కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు శాసనాల సరోజిని, పీవీ కృష్ణారావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు పాదర్తి అంజనేయులు, ప్రధాన కార్యదర్శి సతీష్, నాయకులు రామకృష్ణ, ప్రవీణ్, దాసు, సుబ్బారావు పాల్గొన్నారు.

కరాటేతో ఆరోగ్యం, రక్షణ

పొదిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కరాటేతో ఆరోగ్యంతోపాటు రక్షణ కలుగుతుందని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. కరాటే బ్లాక్‌బెల్ట్ 6వ డాన్ గ్రహీత మాస్టర్ వడ్డే వేణు వద్ద శిక్షణ పొందుతున్న వేణు ఆధ్వర్యంలో బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సర్టిఫికెట్ ను అందజేశారు. కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మనల్నిమనం కాపాడుకునేందకు కరాటే చాలా ఉపయోగపడుతందన్నారు. అనంతరం కరాటే బెల్ట్ టెస్ట్‌లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ఎల్లో, ఆరెంజ్, బ్లూ సర్టిఫికెట్లను సీఐ అందజేశారు. విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇస్తున్న మాస్టర్ వేణుని సీఐ వెంకటేశ్వర్లు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐ వేమన, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలకు చేయూత

బేస్తవారపేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : బేస్తవారపేట మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా ఉన్న అరవీటి భావన, యశ్వంత్ కీర్తనకు కంభం జనసేన పార్టీ నాయకులు రూ.10వేలు, 25కేజీ బియ్యం, వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో చిన్న, వెంకట సురేష్, శ్రీనివాసులు, శ్రీను, షేక్.కాశిం, మస్తాన్, కిరణ్ పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలికి దరఖాస్తులు చేసుకోవాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురంలో వెలసిన లక్ష్మీ చెన్నకేశవస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యుల నూతన నియామకానికి దరఖాస్తు చేసుకోవాలని ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఏపీ ప్రభుత్వం దేవదాయ శాఖ ఈ మేరకు జీవో విడుదల చేసిందని తెలిపారు. ఆసక్తి గల హిందూ అభ్యర్థులు ప్రకటన తేదీ నుంచి 20 రోజులలోగా దరఖాస్తు చేసుకోవాలని ఈవో కోరారు.



ప్రత్యేక అలంకరణలో నాగదేవతల శిలలు

వైభవంగా నాగదేవతల వార్షికోత్సవం

మార్కాపురం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోడపాడు గ్రామంలో నాగదేవతల వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి నాగదేవతలకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులు నాగదేవతల విగ్రహాలకు పూజలు నిర్వహించి పాలు, పండ్లు, కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం గ్రామంలోని కోలాటం బృందం నృత్యంతో అలరించారు.

పోలేరమ్మకు ఆదివారం జాతర

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి జాతర వైభవంగా నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని నిమ్మకాయ దండలు, వివిధ పుష్పమాలలతో అలంకరించారు. తవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో పూజలు జరిగాయి.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

పెద్దదోర్నాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పేదల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఒంగోలు పార్లమెంట్ టీఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఈదర మల్లయ్య అన్నారు. మండలంలోని అయిన ముక్కుల కొండారెడ్డి కాలనీలో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈదర మల్లయ్య ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలిసి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏడాది కాలంలోనే అమలు చేస్తోందని తెలిపారు. సూపర్‌సిక్స్‌లో పింఛన్ పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికివందనం, అన్నదాత సుఖీభవ, ఈనెల 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు జంగిలి పిచ్చయ్య, టీ చెన్నారెడ్డి, బోళ్ల బాలకృష్ణా రెడ్డి, తుమ్మలయ్య, ఎలకపాటి మరియ బాబు, దర్శనం బద్రీ, రమణ, గణేశ్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

మార్కాపురం రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేమలకోట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003- 2004 పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ పాఠశాలలో పదవతరగతి చదివిన తర్వాత 21 ఏళ్ల తర్వాత ఇక్కడ కలుసుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకురించుకొని వ్యక్తిగత విషయాలను చర్చించుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను ఘ నంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుబ్బారెడ్డి, 2003-04 బ్యాచ్ ఉపాధ్యాయులు తిరుపతిరెడ్డి, మహేశ్వరరెడ్డి, లక్ష్మీకుమారి, అస్విలాషిణి, అంజనేయనేయరెడ్డి, చలపతిరావు, సంపత్ కుమార్, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఈశ్వరీదేవి మఠం పునర్‌నిర్మాణానికి సహకరించాలి

పొదిలి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : జగన్మాత ఈశ్వరీదేవి మఠం పునర్‌నిర్మాణానికి దాతలు సహకరించాలని పీఠాధిపతి వీరశివకుమార్ కోరారు. ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విశ్వబ్రాహ్మణులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వబ్రాహ్మణ సంఘం అధికార ప్రతినిధి నాగేశ్వరరావు దంపతులు రూ.25వేలు చెక్కును పీఠాధిపతి వీరశివకుమార్‌కు అందజేశారు. మఠం నిర్మాణానికి కలిసివస్తున్నవారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : యూటీఎఫ్ కార్యాలయం వద్ద యూటీఎఫ్ 52వ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం నిర్వహించారు. తొలుత యూటీఎఫ్ సీనియర్ నాయకులు ప్రభాకర్ యూటీఎఫ్ జెం డాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు మాట్లాడుతూ.. ప్రభుత్వం పీఆర్‌సీ కమిషన్ వేయాలన్నారు. 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించి పెండింగ్‌లో ఉన్న డీఏయూ ఇవ్వాలన్నా రు. పశ్చిమ ప్రకాశంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను విద్యా వలంటీర్లతో భర్తీ చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించటంలో యూటీఎఫ్ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు వెంకటేశ్వర్లు, కాశిరెడ్డి, జయరామిరెడ్డి, చెన్నారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

కాలిన ట్రాక్టర్ పరిశీలన

పుల్లలచెరువు,ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పుల్లలచెరువు మండలంలోని శతకోడు సమీపంలోని పామాయల్ తోటలో అనుమానాస్పదంగా శుక్రవారం కాలిపోయిన ట్రాక్టర్‌ను మార్కాపురం డీఎస్పీ యు.నాగరాజు ఆదివారం పరిశీలించారు. చుట్టుపక్కల వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నాక. ట్రాక్టరు దగ్ధంపై లోతైన విచారణ జరుగుతుందని, విచారణకు రెండు టీంలను ఏర్పాటు చేశామని డీఎస్పీ తె లిపారు. ఆయన వెంట ఎస్ఐ ఎల్.సంపత్‌కుమార్ సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రాచర్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : రాచర్ల పట్టణ ఫీడర్‌లో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ కే బాలగురువయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గంటల నుండి 10గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

ఎయిడెడ్ కళాశాల విద్యార్థులకు వసతులు కల్పించాలి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గవర్నమెంటు జూనియర్ కళాశాలల్లో మాదిరిగా ఎయిడెడ్ జూనియర్ కాలేజీల్లో చదివే పేద విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఎయిడెడ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గారపాటి పుష్పరాజ్, ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ, రాష్ట్ర ట్రెజరర్ పాటిబట్ల లాబాను, ఒంగోలు ఏబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ వాణి అన్నారు. వారంతా ఇంటర్ జోన్-3 ఆర్‌జెడి కె.పద్మకు వినతిపత్రం అందించారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పేద విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పద్మజ హామీ ఇచ్చారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

ముండ్లమూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మలూరు గ్రామంలో వేంచేసి ఉన్న పోలేరమ్మ, అంకమ్మ తల్లికి భక్తులు ఆదివారం పొంగళ్ళు పెట్టి కొలుపులు నిర్వహించారు. నైవేద్యాన్ని ఊరేగింపుగా ఆలయానికి తీసుకెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు.

దొనకొండ: స్థానిక ఆనంద ఆశ్రమంలోని పోలేరమ్మ అమ్మవారికి ఆదివారం ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి నేతృత్వంలో ఘనంగా పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పోలేరమ్మను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ అర్చకులు మణిబాబుశర్మ, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం

కనిగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన మోడల్‌స్కూల్ కమిటీ సభ్యుడు నాగేంద్రబాబుకు ఆకమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్థికచేయూత అందించారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఈనెల 6న ఆయన మృతిచెందారు. కమిటీ చైర్మన్ పి.మోహన్ మృతుని కుటుంబసభ్యులను పరామర్శించి సాయం చేశారు.

ప్రభుత్వ హామీలను అమలుచేయాలి

దొనకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కార్మికులకు, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలుచేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సీఐటీయు మండల మహాసభలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నేటివరకు వేతనాలు పెంచలేదన్నారు. అనంతరం సీఐటీయూ మండ కమిటీని ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా చిరుపల్లి అంజయ్య, సభ్యులుగా జి.ఆదాం, బందెల బాలకోటయ్య, కొండా ఏసుదాసు, పి.లూకయ్య, ఆకుమాల కాశింపీరా, జి.వెంకటస్వామి, తదితరులను ఎన్నుకున్నారు.

మహిళలను మోసంచేస్తున్న ప్రభుత్వం

పామూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మహిళల పాలిట కూటమి ప్రభుత్వం శాపంగా మారిందని వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం జోనల్ అధ్యక్షురాలు, ఎంపీపీ గంగసాని లక్ష్మి ఆరోపించారు. ఆదివారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు.

వ్యవసాయ కార్మిక సంఘం మహాసభలను జయప్రదంచేయాలి

పీసీపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కనిగిరిలో ఈనెల 12న జరిగే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆసంఘం మండల ప్రధాన కార్యదర్శి బడుగు జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం పీసీపల్లిలో మహాసభలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

పామూరు: కనిగిరిలో జరగనున్న వ్యవసాయకార్మిక సంఘం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని మండల కార్యదర్శి కె.మాల్యాద్రి పిలుపునిచ్చారు. మండలంలోని దూబగంట లో ఆదివారం ప్రచారం నిర్వహించారు.

అస్తవ్యస్తంగా సాగునీటి పంపిణీ

» ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తున్న అధికారులు

» ఆగ్రహం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

దర్శి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సాగునీటి పంపిణీ అస్తవ్యస్తంగా తయారైంది. సాగర్ జలాలు ఎందుకు విడుదల చేశారో, వారానికే మళ్లీ ఎందుకు నిలుపుదల చేశారో అర్థంకాని పరిస్థితి నెలకొంది. సాగునీటి పంపిణీ తీరు అధ్వానంగా మారటంతో అన్నదాతల్లో ఆగ్రహం వ్యక్తమవుతుంది. ప్రణాళిక లేకుండా అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గత కొద్ది రోజులుగా జరిగిన పరిణామాలే ఇందుకు నిదర్శనం.

సాగర్ కుడికాలువకు పదిరోజుల క్రితం నీటిని విడుదల చేశారు. ఆక్రమంలో జిల్లాలోని కాల్వలన్నింటికీ పుష్కలంగా నీరు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు ఈనెల 2న అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభించేందుకు దర్శి మండలం తూర్పువీరాయపాలెం గ్రామానికి వచ్చారు. ఆరోజు సాగర్ కాలువలకు నిండుగా నీరు వదిలారు. సాగర్ ప్రధాన కాలువ 85/3 మైలు (ప్రకాశం బార్డర్‌కు) 2300 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు ఆనీరు నేరుగా దర్శి బ్రాంచ్ కాలువ నుంచి ఒంగోలు బ్రాంచ్ కాలువకు చేరింది. మధ్యలో కొన్నిచోట్ల పోయిననీరు మినహా అధికశాతం ఓబీసీకి చేరింది. ఆ సమయంలో ఒంగోలు బ్రాంచ్ కాలువ(ఓబీసీ)కు సుమారు 1300 క్యూసెక్కుల నీరు సరఫరా అవుతుండటంతో కాలువ కట్టలు అంచులను తాకుతూ పొంగి పోర్లిపోయే పరిస్థితి నెలకొంది. దర్శి సమీపంలో ఒంగోలు బ్రాంచ్ కాలువ కట్ట ఎక్కడ తెగిపోతుందోనని ఆందోళన చెందారు. ఆవిధంగా పుష్కలంగా నీరు విడుదల చేయటంతో రైతులు ఆనందంతో వరినార్లు పోశారు. బోర్ల వసతి ఉన్న రైతులు అంతకు ముందే నార్లు పోసుకొని నాట్లకు సిద్ధంగా ఉన్న రైతులు సాగర్ జలాలు రావటంతో ముమ్మరంగా వరినాట్లు ఆరంభించారు. సీఎం చంద్రబాబు రైతులతో ముఖాముఖి నిర్వహించిన ప్రాంతంలో కూడా రైతులు వరినాట్లు వేస్తూ కనిపించారు. కొన్ని పొలాలకు వరి నాట్లు వేసేందుకు దమ్ముచేసి సిద్ధం చేశారు. ఒక దశలో సీఎం చంద్రబాబు వరినాట్లు వేసే పొలాన్ని సందర్శించి రైతులతో మాట్లాడతారని భావించారు. అధికారులు అందుకనుగుణంగా రైతులతో మాట్లాడేందుకు సీఎం వచ్చే అవకాశం ఉందని సంకేతాలు కూడా ఇచ్చారు. అయితే చంద్రబాబు పొలాల్లోకి వెళ్లలేదు. అధికారులు ఇక కాలువకు నీరు విడుదల చేశారనే ఉద్దేశంతో దర్శి ప్రాంతంలో ముమ్మరంగా వరినాట్లు చేపట్టారు. రైతులు ఈఏడాది ముందుగా సాగు నీరు వచ్చాయనే ఆనందంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమైన సమయంలో అకస్మికంగా సాగర్ కాలువలకు నీటి సరఫరాను నిలిపివేశారు.



ఒంగోలు బ్రాంచ్ కాలువలో తగ్గిన నీటి పరిమాణం

సాగర్ ప్రధాన కాలువలతో పాటు బ్రాంచ్ కాలువలకు నీటి పరిమాణం తగ్గిపోవటంతో అన్నదాతలు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం ఎండలు వేసవిని మరిపిస్తున్నాయి. దీంతో వేసిన లేత వరినాట్లు గత మూడు రోజులుగా నీరులేక వాడుముఖం పట్టాయి. అధికారులు సాగర్ కాలువలకు నీరు ఎందుకు విడుదల చేశారో, ఎందుకు నిలుపుదల చేశారో అర్థంకాక ఆయకట్టు రైతులు అల్లాడుతున్నారు.

అధికారుల తీరుపై ఆగ్రహం

ప్రణాళిక లేకుండా వ్యవహరిస్తున్న అధికారుల తీరుపట్ల అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి పంపిణీ అధ్వానంగా మారిందని వాపోతున్నారు. వందలాది ఎకరాల్లో వరినాట్లు వేసి ఎండిపోయే పరిస్థితి నెలకొన్నప్పటికీ అధికారులు ఇప్పటికే విడుదలచేసిన సాగునీరు ఎందుకు నిలిపివేశారో కారణం తెలుపలేదు. కొంతమంది అధికారులు మాత్రం అడిగిన రైతులకు రెండవ జోన్‌కు సాగుకు అధికారికంగా నీరు విడుదల చేయలేదని చెబుతున్నారు. కేవలం వరదనీరు ఉధృతంగా రావటంతో ఆసమయంలో ఇతర అవసరాలకు ఉపయోగపడతాయనే ఉద్దేశంతో సాగర్ కాలువలకు నీరు విడుదల చేశారని చెబుతున్నారు. ఆవిషయం అధికారులు ముందుగా ప్రకటించి ఉంటే రైతులు తొందరపడి వరినాట్లు వేసేవారుకాదు. శ్రీశైలం, సాగర్ జలాశయాలకు నిండుగా నీరు చేరటంతో పంటల సాగుకు నీరు విడుదల చేశారనే ఉద్దేశంతో రైతులు వరినాట్లు పోయటం, తదితర పంటల సాగును ముమ్మరంగా చేపట్టారు. ప్రస్తుతం కాలువలకు నీటి సరఫరా నిలచిపోవటంతో అన్నదాతల పరిస్థితి అయోమయంలో పడింది. ప్రభుత్వం, ఉన్నతాధికారులు రైతులకు జరుగుతున్న నష్టాన్ని గుర్తించి సాగునీటి పంపిణీపై తగు నిర్ణయం తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

సొసైటీల చైర్మన్‌లుగా సుబ్బయ్య, రమణారెడ్డి నియామకం



వల్లభనేని సుబ్బయ్య



గొంది రమణారెడ్డి

తాళ్లూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని మన్నేపల్లి, నాగంబొట్లపాలెం, సొసైటీలకు చైర్మన్, డైరెక్టర్లను నియమిస్తూ చీఫ్ సెక్రటరీ రాజశేఖర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. మన్నేపల్లి సొసైటీ చైర్మన్‌గా గొందిరమణారెడ్డి(సమర), డైరెక్టర్లుగా నవులూరి వీరరాఘవులు, కన్నెబోయిన వీరాంజనేయులు నియమితులయ్యారు. అలాగే, నాగంబొట్లపాలెం సొసైటీ చైర్మన్‌గా వల్లభనేని చినసుబ్బారావు(సుబ్బయ్య), డైరెక్టర్లుగా నగిలి కొండలు, బాయిరెడ్డి ఆదినారాయణను నియమిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. టీడీపీలో క్రియాశీలంగా ఉంటూ సేవలు అందిస్తున్న వీరిని చైర్మన్‌లుగా నియామకం చేయటం పట్ల శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సొసైటీ చైర్మన్‌లుగా తమ కు అవకాశం కల్పించిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని రమణారెడ్డి, సుబ్బయ్య తెలిపారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సోమవరప్పాడు పరిధిలోని గుంటిగంగ సన్నిధిలోగల గుంటి గంగాభవానీ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చల్లంగా కరుణించమని పూజించారు. తాళ్లూరు పరిసర మండల గ్రామాలకు చెందిన భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. పలువురు వాహనదారులు వాహన పూజలు చేయించారు. ఆలయ బ్రాహ్మణ అర్చకులు ఎస్.కామేశ్వరశర్మ, పూజారులు ప్రకాశ్‌పంతులు, విజయలక్ష్మి, బాలరాజు అమ్మవారికి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, దేవదాయశాఖ ఆర్ఏ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. విశ్రాంత డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి దంపతులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారికి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ బ్రాహ్మణ పూజారి కామేశ్వరశర్మ గోత్రనామ పూజలు చేసి ఆశీర్వచనం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం శ్రీనారాయణస్వామి దేవస్థానంలో ఆదివారం పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సహస్రనామ, కుంకుమార్చన పూజలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ గాలి గోపురం వద్ద నుంచి మహానైవేద్యాన్ని మేళతాళాలతో ఆలయ ప్రదర్శన చేసి స్వామివారికి సమర్పించారు. అనంతరం గోశాలలోని గోమాతకు పసుపు, కుంకుమతో హారతి ఇచ్చి పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్నఆదినారాయణ, ఈవో నరసింహబాబు, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

పామూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. ఆదివారం పామూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో సొసైటీ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్‌గా ఉప్పలపాటి హరిబాబు, డైరెక్టర్‌గా వై.రహీముల్లా బాధ్యతలు స్వీకరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ సొసైటీల ద్వారా ప్రభుత్వం మంజూరుచేసే రాయితీ పథకాల్లో రైతు ప్రయోజనాలకే అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీలను ఏడాది కాలంలో అమలుపరుస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. ప్రతిపక్ష పార్టీల ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, ఏ.ప్రభాకర్‌చౌదరి, బొల్లా నరసింహారావు, పాలపర్తి వెంకటేశ్వర్లు, డీవీ మనోహర్, ఎస్‌వీ నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన



కనిగిరిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రజావసరాలకు అనుకూలంగా పాలన సాగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని పామూరు రోడ్డులో ఆదివారం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న సబ్‌రిజిస్ట్రార్ భవనం శిథిలస్థితికి చేరుకుంటుందన్నారు. సుమారు రూ.2 కోట్ల విలువైన భూమిని నందిత్రశ్రీ, నివేదిత్రశ్రీ డెవలపర్స్ ప్రభుత్వానికి భవన నిర్మాణం కోసం సమర్పించినట్లు తెలిపారు. కనిగిరి ప్రాంత ప్రజల సంక్షేమం కోసం ఎంతో విలువైన భూములను ఇచ్చేందుకు ముందుకు వచ్చిన నందిశ్రీ, నివేదిత్రశ్రీ డెవలపర్స్‌కు కనిగిరి ప్రాంత ప్రజల తరుపున కృతజ్ఞతలు చెప్తున్నారు. కార్యక్రమంలో నాయకులు తమ్మినేని శ్రీనివాసుల రెడ్డి, పిచ్చాల శ్రీనివాసులు రెడ్డి, నారపరెడ్డి (యడవల్లి) శ్రీనివాసులురెడ్డి, నంబులు వెంకటేశ్వర్లు, ఫిరోజ్, తమ్మినేని వెంకట రెడ్డి, బారాయిమాం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ దేవతలకు పూజలు

పామూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అయ్యవారిపల్లె గ్రామంలో పెద్దమ్మ, పోలేరమ్మ, అంకాలమ్మ తల్లి దేవస్థాన మొదటి వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేతో ఉగ్రతోపాటు టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, మోపాడు ప్రాజెక్టు సూపర్‌వైజర్ చుంచు కొండయ్యను దేవస్థాన నిర్వాహకులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమాల్లో మార్నేని మాల్యాద్రి, కందుల పిచ్చిరెడ్డి, చీలమలదిన్నె రవీంద్ర, బండారు రమేష్, మార్నేని రామకృష్ణ, మన్నం శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



యోగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వెంగళాయపల్లి విద్యార్థులు

పీసీపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరిలో ఈ నెల 23న జరిగే రాష్ట్రస్థాయి యోగా పోటీలకు వెంగళాయపల్లి ప్రాథమిక పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం స్వర్ణ రమణయ్య తెలి పారు. ఒంగోలులో ఆదివారం జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీలలో వీరు ప్రతిభ చూపారు. పాఠశాలకు చెందిన జశ్వంత్, నాగేంద్ర, మహర్షి 8-10 సంవత్సరాల వయస్సు గల బాలుర విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు. బాలికల విభాగంలో మానస, మోక్షిత, నవ్యలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచి పతకాలు సాధించారు. 12-14సంవత్సరాల బాలుర విభాగంలో రేవంత్‌సాయి, బాలికల విభా గంలో యశశ్విని విజేతగా నిలిచారు. వీరందరూ రాష్ట్రస్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఎంఈవోలు సంజీవి, ఆర్.శ్రీనివాసులు వీరిని అభినందిం చారు.

ఉత్సాహంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



మారెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

ముండ్లమూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఉత్సాహంగా సాగింది. 1980 - 1981 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఒకచోటకు చేరారు. ఆనాడు కలసి మెలసి చదువుకున్న విద్యార్థులందరికీ ఒక చోటకు రప్పించి ఒకరి యోగ క్షేమాలు మరొకరు తెలుసుకోవాలని నిర్ణయానికి వచ్చి పాఠశాలలో చదివిన షేక్ మస్తాన్, బల్లికురవ మండలం మల్లాయపాలెం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న షేక్ మస్తాన్, ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్న ఎంవీ సత్యనారాయణ అందరి ఫోన్ నెంబర్లు సేకరించి ఒకచోటకు చేర్చారు. 39 మంది పూర్వ విద్యార్థులు ఒకరికొకరి యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం ఆనాటి గురువులైన పాశం కిష్టయ్య పంతులు, బొమ్మరాజు గోపాలరావు, ఖరీదు వెంకట రంగారావులతో పాటు మరి కొంత మంది గురువులను ఘనంగా సన్మానించారు.

ముఖ్య అతిథిగా హాజరైన మారెళ్ళ గ్రామ వాసి, రిటైర్డు బ్యాంక్ ఏజీఎం గార్లపాటి రామకృష్ణారావు మాట్లాడుతూ నాలుగు దశాబ్దాల కిందట విద్యాబుద్ధులు నేర్పిన గురువులను గుర్తు పెట్టుకొని పాఠశాలలో సన్మానించుకోవటం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పీవీ సుబ్రహ్మణ్యం, ఘంటసాల పూర్ణచంద్రరరావు, గార్లపాటి కనకలింగేశ్వరరావు, మన్నెం నాగేశ్వరరావు, పి.వెంకిరెడ్డి, జె.రమాదేవి, సుజాత, పద్మావతి, డి.నాగమల్లేశ్వరి, కె.అంజనీదేవి, అంకమ్మ, కె.అనసూర్య, కె.గౌరికుమారి, ఎల్.రాజేశ్వరి, రుక్మిణి, పుల్లయ్య, పాపరావు, బి.వెంకటేశ్వర్లు, నరసింహారావు, సీహెచ్ వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, ఏడుకొండలు, కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చికిత్సపొందుతూ మహిళ మృతి

ముండ్లమూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కెల్లంపల్లి గ్రామానికి చెందిన మీనగ మల్లేశ్వరమ్మ(49) చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె నరసరావుపేటలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మండలంలోని కెల్లంపల్లి గ్రామానికి చెందిన మీనగ మల్లేశ్వరమ్మ, మరికొంతమంది శనివారం ఆటోలో సుంకరవారిపాలెంలో వెళుతున్నారు. ఈక్రమంలో ముండ్లమూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద లారీ ఢీకొనడంతో మల్లేశ్వరమ్మ, అపర్ణ గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన మల్లేశ్వరమ్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతురాలికి భర్త అంజయ్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృత దేహాన్ని దర్శి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఏఎస్ఐ బి.పవన్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

సోమవారం 11 ఆగస్టు 2025





సాగర్ నుంచి నీటి విడుదల

8 క్రస్ట్‌గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

సొంతింటికి.. సాయం

అసంపూర్తి ఇళ్ల నిర్మాణానికి నిధులు

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో పేదల సొంతింటి కల ఆర్భాటపు ప్రకటనలకే పరిమితమైంది. తొలుత ప్రభుత్వం కట్టిస్తుందని చెప్పి చివరకు తూచ్ అంటూ మడమతిప్పింది. లబ్ధిదారులను బలవంతం చేసి.. ప్లాట్లు రద్దు అవుతాయని ఒత్తిడి తేవడంతో కొందరు అప్పులు చేసి అరకొరగా ఇళ్లు నిర్మించుకున్నారు. అయితే అటు ప్రభుత్వ సాయం సరిపోక.. ఇటు అప్పుల భారంతో అనేక మంది ఇళ్ల నిర్మాణాలను మధ్యలోనే నిలిపేసుకున్నారు. దీంతో పేదల సొంతింటి కల మొండిగోడలకే పరిమితమైంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం జగనన్న కాలనీలపై సర్వే చేపట్టి ఇళ్ల నిర్మాణాలపై నివేదికలు రూపొందించింది. ఈ క్రమంలో డబ్బులు లేక మధ్యలో ఇళ్ల నిర్మాణాలను ఆపేసిన లబ్ధిదారులకు సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మూడు విడతల్లో సాయం చేసేందుకు ముందుకు వచ్చింది.

- 2,400 మంది ఖాతాల్లో రూ.3.40 కోట్లు జమ
- లబ్ధిదారులకు మరో రెండు విడతలుగా సాయం

అద్దంకి మండలంలో మధ్యలోనే ఆగిపోయిన జగనన్న కాలనీ ఇళ్లు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి నిధులు ఇవ్వకపోగా కాలనీల్లో కనీస వసతుల కల్పనను విస్మరించగా కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా సాయం చేయడంపై లబ్ధిదారుల నుంచి ఆనందం వ్యక్తమైంది. అర్ధంతరంగా నిర్మాణం నిలిచిపోయిన ఇళ్లను గుర్తించడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు సాయం అందించి నిర్మాణం పూర్తయ్యేలా చూడడానికి ప్రభుత్వం అడుగులేస్తోంది. మూడు విడతలుగా ఈ సాయం అందించి వారి సొంతింటి కల సాకారం చేసేలా కార్యాచరణ రూపొందించింది. దానిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 2,400 మంది లబ్ధిదారుల ఖాతాల్లో తొలి విడత సాయం కింద రూ.3.40 కోట్ల నిధులను ఇటీవలే ప్రభుత్వం విడుదల చేసింది. ఒక్కొక్కరి ఖాతాల్లో రూ.15,000 నుంచి రూ.25,000 వరకు నిధులను జమ చేసింది. ఈ మొత్తాలతో చేపట్టిన పనులు పరిశీలించాక మరో రెండు విడతలుగా నిధులను ప్రభుత్వం అందించనుంది. ఈ ఏడాది చివరికల్లా ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేలా చూస్తామని గృహ నిర్మాణశాఖ చెబుతోంది. లబ్ధిదారుల సొంతింటి కల సాకారం చేయడానికి ప్రభుత్వం అన్ని విధాల అండగా ఉంటుందనే భరోసాను వారిలో కల్పించేలా గృహనిర్మాణ విభాగం పనిచేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే అదనపు నిధులు మంజూరైన వారు ఇంటి నిర్మాణ పనులు తిరిగి ప్రారంభించేలా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పనిచేయాలని ప్రభుత్వం సూచించింది.

నిర్మాణం మధ్యలో ఆగిన ఇళ్లు 22,200

గత ప్రభుత్వంలో జిల్లావ్యాప్తంగా మంజూరు చేసిన మొత్తం ఇళ్లు 49,500 కాగా ఇందులో పూర్తి అయినవి కేవలం 17,300గా ఉన్నాయి. అసలు ప్రారంభం కానివి పదివేల వరకు ఉంటే అర్ధంతరంగా నిలిచిపోయినవి 22,200గా ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం వీటి నిర్మాణాలు పూర్తి చేయడంపైనే దృష్టి పెట్టింది. అదనపుసాయం పొందడానికి అర్హులుగా గుర్తించిన 2,400 మంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమ చేసింది

ఏడాది చివరికే టార్గెట్

మధ్యలోనే నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాన్ని ఈ ఏడాది చివరి కల్లా పూర్తి చేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. ప్రస్తుతం అదనపు సాయం కేటగిరిలో ప్రభుత్వం ఎంపిక చేసిన 2,400 మంది లబ్ధిదారులు వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించే దిశగా చైతన్య పరుస్తున్నారు. వీరిలో 60 శాతం మంది ఇప్పటికే పనులు మొదలు పెట్టగా వివిధ కారణాలతో మిగిలిన 40 శాతం మంది ముందుకు రావడం లేదని తెలుస్తోంది. అవసరమైతే వారిని పీ-4 కింద బంగారు కుటుంబాల జాబితాలో చేర్చి మరింతగా సాయం అందేలా చూసి వారి సొంతింటి కల నెరవేర్చే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది.

మళ్లీ గేట్లెత్తారు

- 8 క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు వరద
- శ్రీశైలం నుంచి 65,842 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- సాగర్ జలాశయంలో పూర్తిస్థాయికి చేరిన నీరు

విజయపురిసౌత్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ గేట్లు మళ్లీ తెరుచుకున్నాయి. ఎగువ నుంచి వరద పోటెత్తడంతో జలాశయంలోని ఎనిమిది గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు. గత ఆదివారం సాగర్ గేట్లను బంద్ చేసి నీటి విడుదలను ఆపేశారు. అయితే మళ్లీ ఆదివారం ఎనిమిది గేట్లు ఎత్తి సాగర్ నుంచి నీటి విడుదల చేశారు. గత నెల 29న డ్యాం అన్ని క్రస్ట్ గేట్లు తెరిచి ఆరు రోజులు దిగువకు నీటిని విడుదల చేసిన విషయం తెలిసిందే. సాగర్ నుంచి ఆరు రోజులు 106 టీఎంసీలను విడుదల చేశారు. ప్రస్తుతం శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లో 65,842 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం సాయంత్రం నీటి విడుదలను ప్రారంభించారు. సాగర్ జలాశయం పూర్తి స్థాయి నీటిమట్టం ఆదివారం నాటికి పూర్తి స్థాయిలో 590.00 అడుగులుకి చేరింది. ఇది 312.04 టీఎంసీలకు సమానం. కుడి కాల్వ ద్వారా 6465 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 7518 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, 8 క్రస్ట్‌గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 64,800 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో 1,09,952 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ప్రకాశం బ్యారేజి వద్ద కొనసాగుతున్న ఉధృతి

తాడేపల్లి టౌన్: ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి కొనసాగుతోంది. పులిచింతల జలాశయంతో పాటు ప్రధాన వాగుల నుంచి 67 వేల 300 క్యూసెక్కుల వరద నీరు ఆదివారం ఇన్‌ఫ్లోగా నమోదు అవుతున్నట్లు నీటిపారుదలశాఖ జేఈ రాజేష్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటి మట్టం కొనసాగుతుండగా 60 గేట్లను 1 అడుగు మేర ఎత్తి దిగువకు 57 వేల 750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా కాల్వలకు 10 వేల 042 క్యూసెక్కులు పశ్చిమ డెల్టా కాల్వలకు 6వేల 908 క్యూసెక్కులు, గుంటూరు ఛానల్‌కు 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు జేఈ తెలిపారు.



ప్రకాశం బ్యారేజి దిగువకు విడుదల అవుతున్న వరదనీరు



మహాశక్తిగా.. బగళాముఖి అమ్మవారు

పిట్టలవానిపాలెం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం మండలంలోని చందోలు గ్రామంలోని శ్రీబగళాముఖి అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహాశక్తి దేవత అలంకరణలో శ్రీబగళాముఖిఅమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, సారెలు సమర్పించుకున్నారు. భక్తులు మొక్కులు తీర్చుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి జి.నరసింహమూర్తి, ఆలయ సీనియర్ సహాయకులు నాగుల శ్రీనివాసరావు, కొండవీటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వరి నాట్లు

నగరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నగరం మండల పరిధిలోని అద్దంకివారిపాలెం, కొలగానివారిపాలెం, పమిడిమర్రు, ధూళిపూడి తదితర ప్రాంతాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో బెంగాల్ నుంచి వచ్చిన కూలీలు నాట్లు, మరికొన్ని ప్రాంతాల్లో స్థానిక మహిళలు నాట్లు వేస్తున్నారు. ఎకరానికి నారుపీకి నాటు వేస్తే రూ.5 వేలు ఖర్చు అవుతుందని రైతులు తెలిపారు. కొన్నిగ్రామాల్లో సాగునీరు అందక రైతులు ఇంజన్లతో సాగు చేయాల్సి వస్తుంది. ఈదుపల్లి, దాసరిపాలెం, మీసాలవారిపాలెం గ్రామాల్లో సాగునీరు లేక నాట్లు కష్టంగా మారుతున్నాయని రైతులు తెలిపారు. ఏదైనా వరుణుడు కరుణిస్తేనే మండల పరిధిలో వరి నాట్లు పూర్తి స్థాయిలో అవ్వడానికి వీలుంటుందని రైతులు తెలిపారు. కూలీల కొరతను అధిగమించవచ్చని, పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయని మరికొన్ని ప్రాంతాల్లో రైతులు వెద పద్ధతిపైనే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు.



వరినాట్లు వేస్తున్న బెంగాల్ రాష్ట్రానికి చెందిన కూలీలు

అన్నదాతల సంబరాలు

- చీరాలలో ట్రాక్టర్లు, ఎడ్ల బండ్ల ప్రదర్శన
- హామీలన్నీ నెరవేరుస్తున్నాం : ఎమ్మెల్యే కొండయ్య



భారీ ర్యాలీలో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అన్నదాత సుఖీభవ నగదు జమ చేయడంపై రైతులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో చీరాలలో ఆదివారం పెద్దసంఖ్యలో రైతులు ట్రాక్టర్లతో, ఎడ్ల బండ్లతో ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్య, ట్రాక్టర్, ఎడ్ల బండి నడిపి రైతులను ఉత్సాహపరిచారు. ఈపూరుపాలెం ఆటోనగర్ నుంచి పందిళ్లపల్లి వరకు సుమారు 20 కిలో మీటర్లు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సైకో పాలన తొలగి కూటమి అధికారం చేపట్టాక రైతులు ఆనందంగా ఉన్నారన్నారు. మాట ఇచ్చినట్లుగా హామీలను నెరవేరుస్తున్నామన్నారు. అందుకే జనం ప్రభుత్వానికి నీరాజనాలు పలుకుతున్నారని తెలిపారు. అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు రూ.3174.43 కోట్లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, టీడీపీ యువ నాయకులు గౌరీ అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.



డెంగీ జ్వరాలకు ఆహ్వానం

- గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
- రోడ్లపైనే మురుగు, చెత్తా చెదారాలు
- రోగాల ముప్పుతో పల్లె ప్రజల్లో ఆందోళన



బల్లికురవ చెన్నుపల్లి రోడ్డులో రోడ్డు పక్కన వ్యర్థాలు

బల్లికురవ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్లపైనే చెత్తాచెదారాలు.. పొంగి ప్రవహిస్తున్న డ్రెయిన్లు.. రహదారులపై ప్రవహిస్తున్న మురుగు.. దుర్వాసన.. దోమలు, అపరిశుభ్రతలు.. డెంగీ జ్వరాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. గ్రామాల్లో పారిశుధ్యం అడుగంటింది. ఇప్పటికే జిల్లాలో పలు ప్రాంతాల్లో డెంగీ, విష జ్వరాల వ్యాప్తి చెంది ఉన్నాయి. దీంతో పల్లె ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎక్కడ చూసిన రోడ్లపై మురుగు విలయ తాండవం చేస్తుంది. రోడ్ల వెంబడి వ్యర్థాలు పేరుకు పోతున్నాయి. కొన్ని గ్రామాల్లో సేకరిస్తున్న చెత్తను కార్మికులు రోడ్ల వెంబడే పడవేస్తున్నారు. చెత్త సంపద కేంద్రాలు ఎక్కడా వినియోగంలో లేవు. అధికారులు ఎంత అవగాహన కల్పించినా గ్రామాల్లో కాల్వల్లో వ్యర్థాలను తొలగించకపోతే దోమల బెడదతో అంటువ్యాధుల ముప్పు పొంచి ఉందని ప్రజలు అంటున్నారు. భారీ వర్షాలు పడితే గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. మండలంలోని కొండాయపాలెంలో రోడ్లపైనే మురుగు ప్రవహిస్తుంది. దీంతో పగలు రేయి తేడా లేకుండా దోమలతో ప్రజలు అల్లాడుతున్నారు. బల్లికురవలో నలువైపులా వ్యర్థాలు పెద్దఎత్తున పేరుకుపోయాయి.చెన్నుపల్లి గ్రామంలో కాల్వల్లో వ్యర్థాలతో మురుగు నీరు ముందుకు కదలడం లేదు. వైదన, వెలమవారిపాలెం, కొత్తూరు, కూకట్ల పల్లి, అంబడిపూడి, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, ముక్తేశ్వరం, సూరేపల్లి, వేమవరం, ఉప్పుమాగులూరు, కొప్పెరపాలెం, ఎస్ఎల్ గుడిపాడు తదితర గ్రామాల్లో చెత్త సంపద కేంద్రాలు పని చేయడం లేదు.

నిధులు లేక సర్పంచ్‌లు విముఖత

పంచాయతీ ఖజానాలో నిధులు లేక పోవడంతో పారిశుధ్య పనులు చేయించేందుకు సర్పంచ్‌లు ముందుకు రావడం లేదు. తమ పదవీకాలం దగ్గర పడుతుండటంతో సొంతంగా కూడా నిధులు వెచ్చించేందుకు ఆసక్తి చూపడంలేదు. ఇప్పుడు ఖర్చు చేస్తే బిల్లులు రాకపోతే ఇబ్బంది అని పలువురు సర్పంచ్‌లు పనులకు వెనుకంజ వేస్తున్నారు.

రుణాల లక్ష్యం.. రూ.12 వేల కోట్లు

- పాడి పరిశ్రమ ప్రోత్సాహానికి ప్రత్యేక చర్యలు
- పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు

పర్చూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈ ఏడాది బ్యాంకుల ద్వారా రూ.12 వేల కోట్ల రుణాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ టి.దామోదర్‌నాయుడు తెలిపారు. మండలంలోని అడుసుమల్లి గ్రామంలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకర్లతో మాట్లాడారు. రైతుల ఆర్థిక పరిస్థితిని తెలుసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రధానమంత్రి కిసాన్ క్రెడిట్ పథకం ద్వారా రుణ సహాయం అందజేస్తామన్నారు. కోళ్ళు, గొర్రెలు, మేకల పెంపకంపై స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆసక్తి చూసేలా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంలో పెయ్య దూడల పెంపకం లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. లింగ నిర్ధారణ వీర్యం ప్రస్తుతం 25 శాతం ఉందని, రాబోయే నాలుగేళ్లలో 90 శాతం ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఏడాది 22,500 గోకులాల నిర్మాణాలు చేపట్టామని, ఈ ఏడాది 50 వేలు నిర్మిస్తామన్నారు. అరెకరం వరకు పశుగ్రాసం సాగుకు సంబంధించి దున్నకం,



పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడును సన్మానిస్తున్న మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు

పెంపకం తదితర ఖర్చులను ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు అందజేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశా లతో పాడి పరిశ్రమ అభివృద్ధికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఒకే రకమైన పంట సాగు ద్వారా దిగుబడులకు గిట్టు బాటు ధర లభించని పరిస్థితులు ఏర్పడతాయని దీన్ని రైతులు గుర్తించాలన్నారు. అనంతరం పర్చూరు వ్యవ సాయ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుంజి వెంకట్రావు ఆధ్వ ర్యంలో దామోదర్‌నాయుడును సన్మానించారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కారుమంచి కృష్ణ, పశుసం వర్ధక శాఖ ఏడీ మాధవీలత పాల్గొన్నారు.

22 సొసైటీలకు త్రిసభ్య కమిటీలు

- ఇంకా 8 సహకార సంఘాలకు పెండింగ్
- గతంలో రెండు విడతలుగా 82 సొసైటీలకు భర్తీ

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

జిల్లావ్యాప్తంగా 22 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 112 పీఏసీఎస్‌లు ఉండగా గతంలో రెండు విడతలుగా 82 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను నియమించిన సంగతి తెలిసిందే. తాజా ఆదేశాలతో మొత్తం 104 పీఏసీఎస్‌లకు నియామకం పూర్తి కాగా మరో 8 సహకార సంఘాల్లో త్రిసభ్య కమిటీలను కొలువుదీర్చాల్సి ఉంది. ప్రస్తుతం ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్న వేళ ఆయా సొసైటీల పరిధిలో రైతులకు మెరుగైన సేవలు అందాలంటే కమిటీల నియామకం తప్పనిసరని ప్రభుత్వం భావించింది. ఇందులో భాగంగానే మొత్తం సొసైటీల్లో త్రిసభ్య కమిటీల నియామకం జరిపేలా ప్రభుత్వం అడుగులేస్తోంది. ఇప్పటికే సొసైటీల్లో ఎరువుల లభ్యత లేదనే ఫిర్యాదులు అందుతున్నాయి. కొత్తగా కొలువుదీరిన సొసైటీల కమిటీలు వీటిపై దృష్టి పెట్టాల్సి ఉంది.

స్పందించిన ఎమ్మెల్యే... పూడ్చిన ఛానల్ గండి

బాపట్ల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పిన్నిబోయినవారిపాలెం బ్రాంచ్ ఛానల్‌కు శనివారం గండిపడి నీరంతా వృధా అవుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఆదేశాల మేరకు ఆదివారం యుద్ధప్రాతిపదికన గండిని పూడ్చారు. నీటిసంఘం అధ్యక్షుడు మద్దిబోయిన సోమరాజు గండిని పరిశీలించి ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్ళటంతో ఆయన సూచన మేరకు ఇసుక బస్తాలతో గండిని పూడ్చారు. గడిచిన ఐదేళ్ళగా కాల్వలు అధ్వాన స్థితికి చేరటం వల్లే ఇలాంటి సమస్య తలెత్తిందని సోమరాజు తెలిపారు.

అవీ.. ఇవీ..

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

● నివాళి అర్పించిన సీఐ మల్లికార్జున్, ఎస్ఐ వినోద్



నివాళి అర్పిస్తున్న సీఐ, ఎస్సై

పంగులూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేణంగి వరం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పర్వతరెడ్డి వెంకట స్వామి(52) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. చినగంజాం మండలం సోపిరాలకు చెందిన వెంకటస్వామికి ఆదివారం ఉదయం ఇంటివద్ద గుండెనొప్పి వచ్చింది. చికిత్స నిమిత్తం ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ ఆయన వైద్యశాలలోనే మృతిచెందారు. 1993 బ్యాచ్‌కు చెందిన వెంకట స్వామి కొంతకాలంగా రేణంగివరం పోలీస్‌స్టేషన్లో హెచ్‌సీగా విధులు నిర్వహిస్తున్నారు. వెంకటస్వామి మరణవార్త తెలుసుకున్న అద్దంకి రూరల్ సి.ఐ. మల్లికార్జునరావు, స్థానిక ఎస్.ఐ. వినోద్‌బాబు తమ సిబ్బందితో సోపిరాలలో వెంకటస్వామి మృతదేహాన్ని సందర్శించి పూలమావేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు. వెంకటస్వామికి భార్య హేమలత, వివాహితులైన ఇరువురు కుమార్తెలు ఉన్నారు.

అధ్యాపకులకు నైపుణ్యాభివృద్ధికి శిక్షణ

చీరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో అధ్యాపకులకు డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించినట్లు సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ముఖ్య అతిథిగా జేఎన్‌టీయూకే మాజీ వైస్ ఛాన్సలర్ డా.కేవీఎస్‌జీ మురళీకృష్ణ విచ్చేసి టీచింగ్ మెథాలజీపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఆధునిక విద్యాబోధనతో వేగవంతంగా అవగాహన పొందుతారని మురళీకృష్ణ చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్. డా.జగదీష్, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

14న రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష

పంగులూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి):మండలస్థాయిలో ఈ నెల 14వ తేదీన పాఠశాల విద్యార్థులకు టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు రోటరీక్లబ్ ఆఫ్ పంగులూరు అధ్యక్షులు డాక్టర్ బత్తుల వీరనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవతరగతి నుండి పదవతరగతి చదివే విద్యార్థులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనవచ్చని తెలిపారు. ఒక్కో తరగతి నుండి 3 నుండి 5గురు విద్యార్థులు వరకు టాలెంట్ టెస్ట్ పోటీలో పాల్గొనవచ్చన్నారు. రోటరీక్లబ్ ఆధ్వర్యంలో పంగులూరు ఉన్నత పాఠశాలలో ఈ పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలస్థాయిలోని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు వారి విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనేలా సహకరించాలని కోరారు. పోటీ పరీక్ష 14వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు జరుగుతుందని తెలిపారు. వివరాలకు 9704726333 నెంబరును సంప్రదించాలని కోరారు.

నల్లవాగుపై వంతెనకు మరమ్మతులు



వంతెనపై కొనసాగుతున్న మరమ్మతులు

అద్దంకి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): నామ్ రోడ్డులో అద్దంకి పట్టణానికి సమీపంలోని నల్ల వాగు వంతెనకు మరమ్మతులు చేస్తున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వంతెన రెండు దశాబ్దాల క్రితం కుంగింది. అప్పట్లో మరమ్మతులు చేసి రాక పోకలు పునరుద్ధరించారు. అనం తరం నామ్ రోడ్డు నిర్మాణ సమయంలో పాత వంతెన తొలగించకుండా, ఒక వైపు రాకపోకలకు ఈ వంతెనను వినియోగి స్తున్నారు. కొత్తగా నిర్మించిన మరో వంతెనపై మరోవైపు రాకపోకలు సాగిస్తున్నారు. అయితే ప్రస్తుతం పాత వంతెన దెబ్బ తింది. దీంతో నామ్ రోడ్డు నిర్వహణ సంస్థ తాత్కాలిక మరమ్మ తులు ప్రారంభించింది. దీంతో వాహనాలు రాకపోకలను ఒకే మార్గంలో సాగేలా డైవర్షన్ ఏర్పాటు చేశారు. సుమారు 4 దశాబ్దాల క్రితం నాటి వంతెన కావడం, నిత్యం నామ్ రోడ్డు లో భారీ వాహనాలు ప్రయాణిస్తున్న నేపథ్యంలో పాత వంతెన స్థానంలో కొత్తదాన్ని నిర్మించాలని, వాహనచోదకులు కోరుతున్నారు.

భవనాసి కాలువలో నాచు తొలగింపు పనులు ప్రారంభం

అద్దంకి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): భవనాసి లోలెవల్ కాలువలో నాచు తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. భవనాసి చెరువు నుంచి గోపాలపురం, అద్దంకి, వేలమూరిపాడు గ్రామాల పొలాలకు సాగునీరు అందించే భవనాసి లోలెవల్ కాలువలో పూర్తిగా నాచు పెరిగి ప్రవాహానికి అడ్డంకిగా మారింది.



నాచును తొలగిస్తున్న ఎక్స్‌కవేటర్

ఆయకట్టు రైతులు నారుమడుల సాగుకు సమాయత్తం అవుతున్న తరుణంలో నీటి విడుదలకు నాచు అడ్డంకి గా మారింది. దీంతో ప్రభుత్వం నుంచి రూ.7 లక్షల మేర నిధులు మంజూరు కావడంతో ఎక్స్‌కవేటర్లు ఏర్పాటు చేసి నాచు తొలగింపు పనులు ప్రారంభించారు. సుమారు 10 కి.మీ దూరం భవనాశి లోలెవల్ కాలువ ఉండగా అవసరమైన ప్రాంతాలలో నాచు తొలగింపు చేయిస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ నారాయణస్వామి తెలిపారు. మరో వారం రోజులలో నీటి విడుదల జరిగే అవకాశం ఉండడంతో నారుమడుల సాగకు రైతులు సమాయత్తం అవుతున్నారు.



కాలువలో దట్టంగా పెరిగిన నాచు

పారిశుధ్య కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించాలి

పర్చూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించాలని, డ్వామా పీడీ విజయలక్ష్మి అధికారులకు సూచించారు. గ్రామాల్లో ఎక్కడ మురుగునీరు నిల్వకుండా చూడడంతో పాటు చూడటంతోపాటు, ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు.



చీరాలలో పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్న ఆర్‌డీవో

కొత్తపాలెం(చీరాల) : వైరల్ ఫీవర్లు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామాల్లో, మున్సిపాలిటీ వార్డుల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో చేపడుతున్న పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణను ఆర్డీవో పరిశీలించారు. పంచాయతీ, ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో శివన్నారాయణ, ఈవోఆర్‌డీ రామకృష్ణ పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు చర్యలు

సంతమాగులూరు : గురిజేపల్లి గ్రామంలో డ్రైనేజీ లో ఉన్న మురుగునీరు బయటకు వెళ్లడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకో వాలని మండల ప్రత్యేక అధికారి పంచాయతీ రాజ్ కార్యనిర్వహక ఇంజనీర్ వేణుగోపాల్‌రెడ్డి సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. డెంగ్యూ నివారణ పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా ఆయన ఆదివారం మండలం లోని గురుజేపల్లి, చవిటిపాలెం గ్రామా లలో పర్యటించారు. విషజ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో సర్పంచి దమ్ము వెంకటరమణ శ్రీనివాసరావు, మాజీ సర్పంచి పెరుమాళ్ల వీరయ్య, ఎంపీడీవో జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శి మోహన్ చంద్, వేముల లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నియోజక వర్గ ప్రత్యేకాధికారి బాలమ్మ, మండల ప్రత్యేకాధికారి అనంత రాజు సూచించారు. మండలంలోని కొండమూరు, చందలూరు, తూర్పుకొప్పెరపాడు, తక్కెళ్లపాడు, జనకవరం గ్రామాలలో ఆదివారం పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ శివచెన్నయ్య ఇన్‌చార్జ్ ఎంపీడీవో సుమంత్, ఏఈ శివయ్య, పంచాయితీ కార్యదర్శి రాంబాబు కల్యాణి పాల్గొన్నారు.

వరి నారుమడుల సాగు ప్రారంభం



సాగులో ఉన్న నారుమడి

బల్లికురవ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బోరు బావుల కింద రైతులు వరి నారు మడుల సాగు ప్రారంభించారు. ప్రస్తుతం ఏబీసీ కాలువపై వంతెన నిర్మాణ పనులు చేపడుతున్నారు. దీంతో ప్రస్తుతం నేరుగా కాలువ నుంచి నీరు రావడం లేదు. అయితే వంతెన నిర్మాణం పూర్తయిన వెంటనే నేరుగా నాట్లు వేసేందుక రైతులు సిద్ధమవుతున్నారు. దీనిలో భాగంగా ప్రస్తుతం బోరుబావుల కింద నారు పోసి సాగుకు సిద్ధం అవుతున్నారు. మండలంలోని వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, గుంటుపల్లి, ముక్తేశ్వరం, కొత్తపాలెం, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, వెలమవారిపాలెం, కొత్తూరు తదతర గ్రామాల్లో నారుమడులు పెంపకం చేపడుతున్నారు.

కారును ఢీకొన్న ద్విచక్రవాహనం

● ఇరువురికి గాయాలు

పంగులూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారిపై ముందు వెలుతున్న కారును ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇరువురు వ్యక్తులకు గాయాలయ్యాయి. ఈ ఘటన 16వ నెంబరు జాతీయరహదారి రేణంగివరం ఫ్లైఓవర్‌పై ఆదివారం చోటుచేసుకుంది. ఒంగోలు నుండి విజయవాడ వెళ్ళే బెలూనో కారును రాయల్ ఎన్‌ఫీల్డ్ వాహనం రేణంగివరం ఫ్లైఓవర్‌పై వెనుక నుండి ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెలుతున్న ఎ.స్టాలిన్, కె.యిసాక్ అనే యువకులు గాయపడగా హైవే అంబులెన్స్ సిబ్బంది వారిని చికిత్స నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

కోదండరామస్వామి ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం



ఆలయానికి, కల్యాణ మండపానికి శంకుస్థాపన చేస్తున్న గ్రామస్థులు

పంగులూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెర పాడు గ్రామంలో శ్రీకోదండరామస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ఆదివారం ప్రారంభించారు. గ్రామంలోని చండూరి, నాదెండ్ల వంశస్థులు కోటి రూపాయల వ్యయ అంచనాతో ఈ ఆలయనిర్మాణానికి శ్రీకారం చుట్టా రు. ఆలయ కట్టడాన్ని పూర్తిగా గ్రానైట్ రాతితో నిర్మిస్తున్నారు. ఈ ఆలయ పునర్నిర్మాణానికి గతంలో భూమిపూజ చేసిన నిర్వాహకులు ఆదివారం శాస్త్రోక్తంగా పూజలు చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయనిర్మాణ నిర్వాహకులు, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి భూమిపూజ

మండలంలోని తూర్పుకొప్పెరపాడు గ్రామంలో కళ్యాణమండప నిర్మాణానికి ఆదివారం భూమిపూజ చేశారు. గ్రామానికి చెందిన పొన్నలూరి లక్ష్మణరావు వారి వంశస్థులతో పాటు చిలకపాటి వంశస్థులు గ్రామస్థుల సహకారంతో రూ.1.20కోట్ల అంచనాతో శ్రీ వెంకటేశ్వర కల్యాణ మండప నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. భూమి పూజా కార్యక్రమంలో మండప నిర్మాణ కమిటీ గౌరవాధ్యక్షులు నాదెండ్ల నరసింహారావు, సర్పంచ్ ఎనికపాటి కల్యాణి శ్రీనివాసరావు, పూనాటి నాగభూషణం, చండూరి సుమంతశేఖర్, చుండూరి నరసింహరావు, గొల్లపూడి ఆంజనేయులు, పూనాటి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



చెట్లకింద కుటుంబసభ్యులతో కలిసి సంతోషంగా గడుపుతున్న విద్యార్థినులు, తల్లి, నానమ్మలతో కలిసి భోజనం చేస్తున్న విద్యార్థిని

మురిపెంగా గోరుముద్దలు పెడదామని..!

● గురుకుల పాఠశాల వద్ద తల్లిదండ్రుల సందడి
● కుటుంబసభ్యులతో ఆత్మీయంగా గడిపిన విద్యార్థులు

అద్దంకి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలలోని తమ విద్యార్థులను కలిసేందుకు తల్లిదండ్రులకు నెలకు ఒకసారి మాత్రమే ఆదివారం పూట అనుమతి ఉంటుంది. ఈ క్రమంలోనే అద్దంకి సమీపంలోని శింగరకొండ వద్ద ఉన్న సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల విద్యార్థులను చూసేందుకు ఆదివారం మధ్యాహ్నం పెద్ద ఎత్తున తల్లిదండ్రులు వచ్చారు. తల్లిదండ్రుల తో పాటు బంధువులు కూడా రావడంతో ఆ పాఠశాల ప్రాంగణంలో సందడి వాతావరణం నెలకొంది. 5వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ రెండవ సంవ త్సరం వరకు సుమారు 600 మంది విద్యార్థి నులు ఇక్కడ చదువుతున్నారు. దీంతో తమ పిల్లలతో కలిసి గడిపేందుకు కుటుంబ సభ్యులు రెండు వేల మంది పైనే వచ్చారు. ఇంటి వద్ద నుంచే ఆహారం తీసుకొచ్చి పిల్లల తో కలిసి భోజనాలు చేశారు. కార్తీక మాసం లోనే వన భోజనాలను తలపించే లా ఉన్నాయి. దీంతో పాఠశాల ఆవరణ అంతా సందడి గా మారింది. యువకులు ప్రవేశించ కుండా గేటు వద్ద జాగ్రత్తలు తీసుకున్నారు.



విద్యార్థినికి భోజనం తినిపిస్తున్న తల్లి

సేవా కార్యక్రమాల నిర్వహణ అభినందనీయం

● హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి జగడం



ఓపీ అందజేస్తున్న జస్టిస్ సుమతి

పేరాల(చీరాల), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నేటి యువతరం సేవాదృక్పథంతో కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని హైకోర్టు న్యాయమూర్తి జెస్టిస్ జగడం సుమతి అన్నారు. పేరాల శాంతినగర్‌కు చెందిన ఉన్నం సంగీతరావు జ్ఞాపకార్థం ప్రసాద్ డయగ్నోస్టిక్స్, సంగీతరావు కుటుంబ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి క్యాంపును ప్రారంభించారు. కార్యక్రమానికి క్రియాశీలకంగా వ్యవహరించిన కుటుంబ సభ్యురాలు డా.ఉన్నం షెర్లీఫ్లోరెన్స్‌ను న్యాయమూర్తి అభినందించారు. ఈ వైద్యశిబిరంలో 500కు పైగా ప్రజలు హాజరయి గుండె, షుగర్, చిన్నారుల సమస్యలు, నరాలు, ప్లాస్టిక్ శస్త్రచికిత్స, క్యాన్సర్, కంటి తదితర రుగ్మతలకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందుకున్నారు. కార్యక్రమాన్ని ప్రసాద్, కిరణ్ తదతరులు పర్యవేక్షించారు.

75 మందికి ఉచిత వైద్యపరీక్షలు

అద్దంకి, ఆగస్టు10 (ఆంధ్రజ్యోతి): రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక రేణింగవరం రోడ్డులోని అహ్మద్ స్పెషాలటీ వైద్యశాలలో ఒంగోలు ఏవీఐఎస్ వైద్యశాల వైద్యుల సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ కావ్య ఆధ్వర్యంలో 75 మంది రోగులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు బాచిన శివధరహర్షచంద్రరావు, అలహరి హరిప్రసాద్, చిన్ని కామేశ్వరరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, మహ్మద్ రఫీ, అంజాద్‌బాషా, చప్పిడి వీరయ్య, పువ్వాడ రామకోటేశ్వరరావు, చుండూరి మురళీసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ వృద్ధాశ్రమంలో అన్నదానం

అద్దంకి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ జన్మదినం సందర్భంగా బీజేపీ నేతలు ఆదివారం శింగరకొండలోని శ్రీరామ వృద్ధాశ్రమంలో, శింగరకొండ లక్ష్మీ నరశింహస్వామి దేవస్థానం మాజీ చైర్మన్ జువ్వి రాము ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండముది బంగారుబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు సు బ్రహ్మణ్యంశర్మ, జువ్వి రాము, ఈదా చిన్న శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌన్సిల్ ప్రత్యేక సమావేశం

చీరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చీరాల మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ అబ్దుల్ రషీద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే సమావేశానికి కౌన్సిల్ సభ్యులు హాజరుకావాలని కోరారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కృషి

● యువనాయకుడు గౌరీఅమర్నాథ్



బహుమతులను అందజేస్తున్న గౌరీఅమర్నాథ్

చీరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నియోజక వర్గంలో క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహించేందుకు కృషిచేస్తున్నట్లు యువ నాయకులు గౌరీ అమర్నాథ్ అన్నారు. రెండురోజులుగా స్థానిక వీఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాలలో నిర్వహిస్తున్న 36వ ఇంటర్ డిస్ట్రిక్ట్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లోని విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. పోటీలు సోమవారంతో ముగుస్తున్నట్లు చెప్పారు. జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీలకు అంతర్ జిల్లాల నుంచి సుమారు 1500 మంది క్రీడాకారులు హాజరుకావడం హర్షణీయమన్నారు. వారికి తగిన సౌకర్యాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కమిటీ ప్రతినిధులు పర్యవేక్షించారు.

కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన

● 334 మందికి ఆపరేషన్లు అవసరమని గుర్తింపు



వైద్య శిబిరానికి హాజరైన వృద్ధులు

మార్టూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో ఆదివారం నోవా అగ్రి గ్రూప్, ఏలూరి ఛారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర కంటిఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగాకంటి వైద్యశిబిరానికి విశేషమైన స్పందన లభించింది. శిబిరానికి 751 మంది హాజరు కాగా, ముందుగా బీపీ, రక్త పరీక్షలు నిర్వహించారు. వీరిలో 334 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించారు. శిబిరంలో రోగులకు భోజన ఏర్పాట్లు చేశారు. శిబిరంలో ముందుగా ఎన్‌టీఆర్, ఏలూరి నాగేశ్వరరావుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో తాటి నాగేశ్వరరావు, కామేపల్లి హరిబాబు, తొండెపు ఆదినారాయణ, పోపూరి శ్రీనివాసరావు, నల్లపనేని రంగయ్యచౌదరి, కమ్మ శివనాగేశ్వరరావు, అడుసుమల్లి శ్రీనివాసరావు, గుదే తారకరామరావు, తేలప్రోలు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం చైర్మన్‌గా రామారావు

బల్లికురవ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొమ్మినేనివారిపాలెం సహకార సంఘం చైర్మన్‌గా కొమ్మాలపాటి రామారావును నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు ఇచ్చింది. సభ్యులుగా దివ్వె రాధా కృష్ణ, కీర్తిపాటి శ్రీనివాసరావులను నియమిస్తు ఉత్తర్వులు వచ్చాయి. దీంతో కొమ్మినేనివారిపాలెం టీడీపీ నేతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ ఎంపికకు సిఫార్సు చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు సభ్యులు కృతజ్ఞత తెలిపారు.


త్రిసభ్య కమిటీల నియామకం

చినగంజాం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతగుంపల్లె, నీలాయపాలెం ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. చింతగుంపల్లె పీఏసీఎస్ చైర్మన్‌గా గొనసపూడి గ్రామానికి చెందిన బత్తుల శ్రీనివాసరావు, డైరెక్టర్లుగా సందు శ్రీనివాసరావు, యాదల నాగేశ్వరరావు, నీలాయపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా నీలాయపాలెం గ్రామానికి చెందిన తూమాటి రంగనాయకులు, డైరెక్టర్లుగా ఆసోది కోమలి, గడ్డం సుబ్బారావులు నియమితులయ్యారు. నూతనంగా నియమతులైన చైర్మన్లు, డైరెక్టర్లకు పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు శుభాకాంక్షలు తెలిపారు.

ఎయిడెడ్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం అందించండి

చీరాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల మాదిరిగా ఎయిడెడ్ జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజన పథకం అందజేయాలని ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గారపాటి పుష్పరాజ్ కోరారు. ఆదివారం ఇంటర్మీడియట్ జోన్-3 ఆర్‌జేడీ(రీజనల్ జాయింట్ డైరెక్టర్) పద్మను కలిసి వినతిపత్రం అందజేశారు. పాఠ్యపుస్తకాల వెసులుబాటు కూడా లేక నిరుపేద విద్యార్థులు అవస్థలు పడుతున్నట్లు వివరించారు. దీనిపై ఆర్‌జేడీ సానుకూలంగా స్పందిచనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన సలహాదారు మురళీకృష్ణ, ట్రెజరర్ లాబాను, ఒంగోలు ఏబీఎం ప్రిన్సిపల్ వాణి, రవి తదితరులు ఉన్నారు.





పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు వీరే...

సొసైటీ పేరు	చైర్మన్ పేరు
కొట్టాలపల్లి	గడ్డం వెంకటసామయ్య
గుండాలమ్మపాలెం	బీ వినీల్‌కుమార్‌రెడ్డి
పొదలకూరు	తలచీరు మస్తాన్‌బాబు
చింతారెడ్డిపాలెం	చింతా ప్రభాకర్‌రెడ్డి
కలివెలపాలెం	చెన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి
కోడూరుపాడు	గంగి జయరామిరెడ్డి
మాదరాజుగూడూరు	బైనబోయిన సుధాకర్
గుండ్లపాలెం	పముజుల ప్రదీప్
ఇందుకూరుపేట	గండవరపు అమర్నాథ్‌రెడ్డి
నిడిముసలి	చిరమన వినీల్‌రెడ్డి
ఆత్మకూరు	పరిటాల సత్యనారాయణ
యన్నవాడ	కొల్లి నరసయ్య నాయుడు
రాజవోలు	కాటంరెడ్డి నరసింహారెడ్డి
అనంతసాగరం	మెట్టుకూరు ధనుంజయరెడ్డి
చేజర్ల	బూదళ్ల బీరరాఘవరెడ్డి
కావలి	కాటా భాస్కర్‌రెడ్డి
మద్దూరుపాడు	గుంటూరు మల్లికార్జున్
సర్వాయపాలెం	నందు వెంకయ్య
ఇందుపూరు	ఎండేటి హరికృష్ణ
జలదంకి	కరియావుల అప్పలనాయుడు
కలిగిరి	కదిరి రంగారావు
సిద్ధలకొండూరు	మెట్టుకూరు కృష్ణజీవిరెడ్డి
కుడుములదిన్నెపాడు	భాష్యం నరసింహులు నాయుడు
గరిమెనపెంట	అల్లిక మధు
గుడవల్లూరు	కంకు మోహన్‌రావు
పెదపుత్తేడు	ఈదల రవికృష్ణారెడ్డి
నందిపాడు	మండల మధు
బూదవాడ	వనిపెంట వెంకటసుబ్బారెడ్డి
భీమవరం	యర్రమల్ల చిన్నారెడ్డి
మారంరెడ్డిపల్లి	సోమనబోయిన రాజశేఖర్
వరికుంటపాడు	గుర్రం గోపి
వింజమూరు	చల్లా వెంకటేశ్వర్లు
పడుగుపాడు	నాగారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి
బుచ్చిరెడ్డిపాలెం	ఏటూరి శివరామకృష్ణారెడ్డి
వవ్వేరు	దొడ్ల విజయలక్ష్మి
దామరమడుగు	రెనగాళ్ల సిద్ధార్థ
తలమంచి	పీ సూర్యనారాయణ
యల్లాయపాలెం	వై వంశీధర్‌రెడ్డి
సంగం	గుండ్లపల్లి శ్రీనివాసులు
ముదివర్తి	తన్నీరు రాజయ్య
మహాదేవపురం	నల్లూరు సుబ్బారావు
ఎర్రారెడ్డిపాలెం	బలుసు లింగయ్య
చిన్నపవని	ముల్లపాటి లక్ష్మీనరసింహ చౌదరి
పోకూరు	గట్టమనేని లక్ష్మీనరసింహ
బడేవారిపాలెం	ఉన్నం రంగారావు
గుడ్లూరు	దామా వెంకటేశ్వర్లు
దరకానిపాడు	నరాల మాలకొండారెడ్డి
ఉలవపాడు	రాచగల్ల సుబ్బారావు
చాగల్లు	రాయపాటి వెంకట మహేశ్వరరావు
మనుబోలు	పొన్నూరు రామకృష్ణయ్య
కృష్ణపట్నం	పల్లంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి
పేడూరు	గూడూరు నారాయణ
టీపీ గూడూరు	నన్నారెడ్డి సురేష్‌రెడ్డి
చౌటపాలెం	ఆర్ రాధాకృష్ణమనాయుడు
రాపూరు	దందోలు వెంకటేశ్వరరెడ్డి
కలువాయి	గడిపర్తి జగడాలనాయుడు
సైదాపురం	అమ్మినేని సుబ్రహ్మణ్యం

మరి కొందరు ‘నామినేటెడ్’

ఒకేసారి 57 పీఏసీఎస్‌లకు కమిటీలు

ఒక్కో కమిటీలో ముగ్గురికి చోటు

- ప్రభుత్వ ఉత్తర్వుల జారీ
- కష్టపడ్డవారికి దక్కిన న్యాయం

నెల్లూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్‌ల)కు పాలకవర్గాలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసింది. ఆరునెలల క్రితమే ఎమ్మెల్యేలు వారి పరిధిలోని పీఏసీఎస్‌లకు త్రీమెన్ కమిటీల కింద పేర్లను నామినేట్ చేసి ప్రభుత్వానికి పంపారు. అయితే సాంకేతిక కారణాలతో కొత్త కమిటీల ఏర్పాటులో జాప్యం జరిగింది. కానీ ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా పెద్ద సంఖ్యలో పీఏసీ ఎస్‌లకు పాలకవర్గాలు నియమిస్తూ జీవోలు జారీ అయ్యాయి. ఒక్క నెల్లూరుజిల్లాలోనే 57 సంఘాలకు కమిటీలు ఏర్పాటయ్యాయి. ఒక్కో కమిటీలు ముగ్గురికి చోటు కల్పించారు. వారిలో ఒకరిని చైర్‌పర్సన్‌గా నియమించారు. గతనెలలో మూడు కమిటీలకు పాలకవర్గాలను నియమించారు. మొత్తంగా చూసుకుంటే జిల్లాలో 78 పీఏసీఎస్‌లు ఉండగా, అందులో ఓగూరు, ముసునూరు పీఏసీఎస్‌లను రద్దు చేసేందుకు ప్రతిపాదనలు వెళ్లాయి. ఇక మిగిలిన 76 సంఘాలకుగా నూ ఇప్పటికి 60 సంఘాలకు కమిటీలను నియమించారు. మిగిలిన 16 సంఘాలకు త్రీమెన్ కమిటీలు నియమించాల్సి ఉంది. తాజాగా విడుదలైన ఉత్తర్వుల ప్రకారం ఒకేసారి 171 మందికి నామినేటెడ్ పదవులు దక్కాయి. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీకి చెందినవారు ఈ జాబితాలో ఉన్నారు. కష్టకాలంలో పనిచేసిన వారికి ఆయా పార్టీలు ప్రాధాన్యం ఇచ్చాయి. ఇంత పెద్దసంఖ్యలో ఒకేసారి నామినేటెడ్ పదవులను భర్తీ చేయడంతో అధికార పార్టీల్లో సందడి నెలకొంది. కాగా వైసీపీ ప్రభుత్వంలో నియమించిన కమిటీల గడువు గతేడాది ముగిసింది. అప్పటి నుంచి అధికారులే పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. తాజాగా నూతన కమిటీల నియామకంతో వ్యవసాయ పరపతి సంఘాల పాలన తిరిగి గాడిలో పడనుంది.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కావలి రూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మలపెంట బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పద్మావతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి 5వ తరగతిలో మిగిలిన 18సీట్లకు ప్రవేశ పరీక్ష నిమిత్తం దరఖాస్తులు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 14 సాయంత్రం 5 గంటల లోపు తుమ్మలపెంట పాఠశాలలో అందజేయాలని తెలిపారు. 16వ తేదీ ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, విద్యార్థుల ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం 8712625048, 9247245429, 9963885240ను సంప్రదించాలని పేర్కొన్నారు.



రోజుకో టీఎంసీ!

- సోమశిలకు కృష్ణా జలాల రాక
- నెల నుంచి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో
- ఇప్పటి వరకూ 25 టీఎంసీల రాక
- ఈ ఏడాది రెండు ప్రాజెక్టులకు జలకళ
- రానున్న సీజన్‌లో సాగుకు ఢోకా లేదు...!

నెల్లూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలాల రాకతో పెన్నమ్మ పులకరిస్తోంది. గతేడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కృష్ణా జలాలు సోమశిలకు చేరుతున్నాయి. రికార్డు స్థాయిలో ఈ ఏడాది కృష్ణానదికి జూలైలోనే వరదలు పోటెత్తడంతో జిల్లాకు కలిసొచ్చింది. మరో నెల పాటు ఇలాగే ఇన్‌ఫ్లో కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నా యి. దీంతో ఈ ఏడాది మొదటి పంటకు ఢోకా ఉండదని అధికారులు అంచనా వేస్తున్నారు. పూర్తి ఆయకట్టులో సాగు చేపట్టేందుకు అవసరమైన నీరు ప్రాజెక్టుల్లోకి వచ్చి చేరుతోంది. గతేడాది మాదిరిగానే ఈ దఫా కూడా సోమశిల, కండలేరు జలాశయాలు కృష్ణాజలాలతో జళకళను సంతరించుకోనున్నాయి.

● లోటు వర్షపాతం ఉన్నా జలకళ

ఈ ఏడాది ఎండలు విపరీతంగా ఉండటం, దానికితోడు లోటు వర్షపాతం కూడా నమోదవడంతో రైతులు ఆందోళన చెందారు. పెన్నా పరివాహకంలో వర్షాలు కురవకపోతే మొదటి పంట సాగు ఎలా.. అన్న చింత వారిలో ఉండేది. అయితే కృష్ణానదికి వరదలు పోటెత్తడం, శ్రీశైలం నిండుకుండలా మారిపోవడంతో వెంటనే ప్రభుత్వం మేల్కొంది. పోతిరెడ్డిపాడు నుంచి కృష్ణాజలాలను సోమశిలకు తరలించడం ప్రారంభించింది. జూలై 9 నుంచి సోమశిలకు కృష్ణా జలాల రాక మొదలైంది. తొలుత 4 వేల క్యూసెక్కులు మాత్రమే వస్తుండగా, క్రమేణా దాన్ని ఇప్పుడు 16 వేల క్యూసెక్కులకు పెంచారు. గత పది రోజులుగా 15 వేల క్యూసెక్కులకు తగ్గకుండా ఇన్‌ఫ్లో వస్తున్నది. మొత్తం గా ఈ నెల రోజుల్లో 25 టీఎంసీల నీరు సోమశిల, కండ లేరుకు వచ్చి చేరింది. ఈ క్రమంలో జిల్లా అధికారులు ముందు చూపుతో ఆలోచించి, సోమశిల నుంచి కండలేరుకు నీటి విడుదల ప్రారంభించారు. రోజూ 6 వేల క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇలా సోమశిలలో 22 టీఎంసీలు, కండలేరులో మరో 3 టీఎంసీల నీరు కృష్ణా జలాలు చేరాయి.

● ఈ ఏడాది పుష్కలమే..!

ఈ ఏడాది ఇప్పటికే శ్రీశైలం మొదలు ప్రకాశం బ్యారేజీ వరకు అన్నీ జలాశయాలు పూర్తిగా నిండాయి. శ్రీశైలం, పులిచింతల ప్రాజెక్టుల్లో 90శాతం నీరు నిల్వ ఉండగా, నాగార్జునసాగర్, ప్రకాశం బ్యారేజీల వద్ద 99 శాతం నీరు నిల్వ ఉంది. అదే సమయంలో శ్రీశైలం ప్రాజెక్టుకు ఇంకా వరద కొనసాగు తోంది. ఆదివారం ఉదయం కూడా 1.50 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో కృష్ణా డెల్టా ప్రాజెక్టుల్లో నీరు నిల్వ చేసుకునేందుకు ఇక అవకాశం లేదు. కాబట్టి రానున్న నెల రోజుల్లో కృష్ణా జలాల రాక సోమశిలకు కొనసాగే అవకాశాలు న్నట్లు ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం సాగవు తున్న రెండో పంటకు మరో నెలపాటు నీరు ఇవ్వాల్సి ఉంది. అందుకు మరో 10 టీఎంసీల వరకూ ఖర్చవుతుంది. ఈ నెల రోజుల్లో మరో 30 టీఎంసీలు కృష్ణాజలాలు తీసుకురాగలిగితే మొత్తంగా 60 టీఎంసీల వరకూ సోమశిలలో ఉండే అవకాశముంది. అప్పుడు మొదటి పంటను పూర్తి ఆయకట్టులో సాగు చేసేందుకు వీలు కలుగుతుంది. ఇక కండలేరులో కూడా ప్రస్తుతం 26 టీఎంసీల నీరు ఉంది. ఈ జలాశయం కింద కూడా మొదటి పంటకు పూర్తి విస్తీర్ణానికి నీటి కేటాయింపులు ఇచ్చే అవకాశం కలుగుతుందని అధికారులు భావిస్తున్నారు. ఈలోపు పెన్నా పరివాహకంలో వర్షాలు కురిస్తే సోమశిల, కండలేరు జలాశయాలను వచ్చే ఏడాది రెండో పంటకు కూడా సరిపడేలా నీటి నిల్వ చేసుకునేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మొత్తంగా కృష్ణా జలాల రాక జిల్లా రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరస్తోంది.

15,916 క్యూసెక్కుల వరద రాక

ఆరో నంబరు గేటు మూసివేత

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి ఎగవ నుంచి ఆదివారం 15,916 క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తోంది. దీంతో జలాశయం నీటిమట్టం 39.353 టీఎంసీలకు చేరుకోగా, ఉత్తర కాలువకు 370, వరద కాలువకు 6,000, డెల్టాకు 1,850 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇది ఇలా ఉంటే ఆరో నంబరు గేటు మూసి నీటిని నిలుపుదల చేశారు. దీంతో సోమశిల నుంచి నెల్లూరుకు రాకపోకలు కొనసాగాయి.

కండలేరు ఇన్‌ఫ్లో 5,280 క్యూసెక్కులు

రాపూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : కండలేరు డ్యాం నీటి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ఆదివారం నాటికి నీటి మట్టం 25.917 క్యూసెక్కులుగా ఉందని ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. సోమశిల నుంచి 5280 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 1945 క్యూసెక్కులు అవుట్ ఫ్లోగా ఉందని ఆయన తెలిపారు.

జలజీవన్ మిషన్ పైలాన్, శిలాఫలకం ధ్వంసంపై కేసు

- ఏడుగురిపై నమోదు, ఇద్దరి అరెస్టు
- నిందితులంతా వైసీపీ నేతలే..

కావలి,ఆగస్టు10(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం తుమ్మలపెంటలో జలజీవన్ మిషన్ పైలాన్, శిలాఫలకం ధ్వంసం చేసిన ఘటనపై ఏడుగురిపై కేసు నమోదు చేశామని, వారిలో ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వీ. శ్రీధర్ తెలిపారు. కావలి డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసు వివరాలు వెల్లడించారు. ఈ సంఘటనలో నిందితులంతా వైసీపీ వారేనని పేర్కొన్నారు. వైసీపీ నేతలే వాటిని పగులకొట్టి కూటమి నేతలపై నెట్టే ప్రయత్నాలు చేశారన్నారు. వైసీపీ నేతల లేఅవుట్‌కు రోడ్డుకు మధ్యలో పైలాన్, శిలాఫలకం అడ్డుగా ఉండటంతో వాటిని తొలగించి లేఅవుట్‌కు దారి ఇస్తామని, గతంలో పొలం అమ్మినప్పుడే పామంజి యానాదయ్య చెప్పారన్నారు. దీంతో వైసీపీ నాయకులు పథకం ప్రకారం ఈనెల 6 అర్ధరాత్రి గ్రామంలో విద్యుత్ సరఫరా ఆపు చేయించి, కోడూరు జక్కరయ్య ఎక్స్‌కవేటర్‌తో శిలఫలకం ధ్వంసం చేసి వాటి శిథిలాలను ఆయన పొలంలోనే వేశారని డీఎస్పీ పేర్కొన్నారు. ఈ కేసులో కోడూరు జక్కరయ్య, పామంజి యానాదయ్య, కోడూరు ప్రేమసాగర్, వాయిల తిరుపతయ్య, కుమారి రాజు, కుమారిశ్రీను అలియాస్ డీలర్ శ్రీను, కొల్లు ఏడుకొండలను ప్రధాన నిందితులుగా గుర్తించామన్నారు. వారిపై కేసు నమోదు చేసి, వారిలో కోడూరు జక్కరయ్య, పామంజి యానాద య్యను అరెస్ట్ చేశామని చెప్పారు. పైలాన్, శిలాఫలకం ధ్వంసం చేయడానికి వినియోగించిన ఎక్స్‌కవేటర్‌ను, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. కేసు విచారణలో ఉందని, మిగిలిన నిందితులకోసం గాలిస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. ఈ సమావేశంలో రూరల్ సీఐ రాజేశ్వరరావు, సర్కిల్ సీఐ పాపారావు, ఒకటో పట్టణ, రెండోపట్టణ సీఐలు ఎండీ .ఫిరోజ్, గిరిబాబు, ఎస్ఐలు తిరుమల రెడ్డి, బాజీబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్, పాల్గొన్న సీఐలు

● విద్వేషాలు రెచ్చగొట్టేందుకే...

ప్రశాంతంగా ఉండే తీరగ్రామాల్లోని మత్స్యకారుల మధ్య, పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే క్రమంలో వైసీపీ నేతలే వాటి ధ్వంసానికి పాల్పడ్డారు. వారి కుట్రలు స్థానికులు సెల్‌ఫోన్లలో చిత్రీకరించిన పైలాన్ కూల్చివేత ల చిత్రాలతో బట్టబయలయ్యాయి. అంతేకాక టీడీపీ నేతలు కూల్చివేశారని దుష్ప్రచారానికి తెరలేపారు. ఇప్పటికైనా అధికారులు, గ్రామాల్లో ఎలాంటి విద్వేషాలు చెలరేగకుండా ముందస్తు నిఘా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గుట్టుగా భూసేకరణ

- వ్యక్తిగతంగా రైతులను కలుస్తున్న ఇండోసోల్ ప్రతినిధులు
- ఎకరా రూ.20 లక్షలకు అన్నదాతల మొగ్గు

ఉలవపాడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఇండోసోల్ కంపెనీ ప్రతినిధులు మండలంలోని కరేడు గ్రామంలో గుట్టుగా భూసేకరణ చేస్తున్నారు. కరేడు పంచాయతీలోని ఇతర గ్రామాల రైతుల భూములపై వారు దృష్టి పెట్టారు. రైతులను వ్యక్తిగతంగా కలుస్తూ వారిని ఒప్పించి భూములు లాగేసుకుంటున్నారు. 50శాతం భూమి బయట గ్రామాల వారిది కావడంతో పాటు ఎకరాకు రూ.20లక్షలు ఇస్తామని చెప్పడంతో రైతులు కూడా భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారు.

● అంతరేటు వస్తుందా..?

ఎంతకాలం ఎదురు చూసినా కొన్ని భూములకు అంత రేటు పలకడం కష్టమని, వచ్చిందే జమ అన్నట్లు బయట గ్రామాలకు చెందిన కొందరు రైతులు అంటున్నారు.ఈ మాటలు పసికట్టిన ఇండోసోల్ కంపెనీ తమ ప్రతినిధులను రంగంలోకి దింపింది. కరేడు భూసేకరణలో గజిట్‌లో కనపరిచిన ఉలవపాడు, మన్నేటికోట, సింగరాయకొండ, శానంపూడి, కనమళ్ల, గవదగట్లపాలెం, బద్దిపూడి, ఒంగోలు సెటిలర్ల రైతుల వివరాలను సేకరించింది. ఆయా గ్రామాల్లో స్థానిక అధికార పార్టీ నాయకుల సహకారంతో నేరుగా రైతుల దగ్గరకు వెళ్లి సంప్రదింపులు జరుపుతున్నారు. ఉలవపాడులోని బీసీ ఉప కులాలైన యాదవ, వడ్డెర, కైకాల, చాకలి, డీకే పట్టాలు కలిగిన ఎస్సీ రైతులను ఒక్కొక్కరిగా స్థానిక నాయకులతో ఇండోసోల్ ప్రతినిధులు కలుస్తున్నారు. రెవెన్యూ అధికారులు చెప్తున్నదాని ప్రకారం కరేడు రైతుల భూమి కంటే బయట గ్రామాల రైతుల భూములే 50 శాతంపైనే ఉన్నాయి. ఇదేవిషయాన్ని పసిగట్టిన ఇండోసోల్ కంపెనీ తమ ప్రతినిధులను రంగంలోకి దింపి ఉలవపాడు, మన్నేటికోట, సింగరాయకొండ పరిసర గ్రామాల్లో కరేడు భూములు కలిగిన రైతుల కోసం జల్లెడ పడుతోంది.

● రైతుల మొగ్గు

ఉలవపాడుకు చెందిన రైతుల భూము లు ఎక్కువ భాగం చెరువు ఆయకట్టు కంటే, సపోటా, మామిడి పంటల సాగులో ఉన్నా యి. మరికొందరివి చిల్లకాలువ వెంబడి చౌడు భూములు కావడంతో ఏళ్ల తరబడిన ఎదురుచూసినా రూ.20 లక్షల రేటు పలకదు. అంతధర ఇవ్వడం తమ నెత్తిన పాలుపోసినట్లని ఎక్కువభాగం రైతులు భూములు ఇచ్చేందుకు సమ్మతించారు. మరికొంతమంది రైతులు ఇంకా భూమిరేట్లు పెంచుతారేమో అన్నట్లు ప్రస్తుతానికి ససేమిరా అన్నట్లు తెలుస్తోంది. ఒకరిని చూసి ఒకరు రైతులు భూములు ఇచ్చేందుకు ముందుకు వస్తున్నారని, రైతులకు నచ్చచెప్పి భూములు ఇచ్చేందుకు ఒప్పించిన నాయకులకు తాయిలాల ఆశలు చూపినట్లు భోగట్టా. మొత్తం మీద గత మూడు వారాల నుంచి ఇండోసోల్ ప్రతినిధులు కరేడు చుట్టుపక్కల ఉన్న బయట గ్రామాల రైతుల దృష్టి పెట్టి భూములు లాగేసుకుంటున్నారు. ప్రస్తుతానికి సుమారు 1500 ఎకరాల భూమికి సంబంధించిన పాసుపుస్తకాలు, ఆధార్ కార్డుల జెరాక్స్‌లు సమ్మతించిన రైతుల నుంచి తీసుకున్నట్లు తెలుస్తోంది.

ప్రసన్నుడి పుష్కరిణికి శ్రీకారం 7లో..

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	112
స్కిన్ చికెన్	208
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 505

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.9728
వెండి కిలో ధర	రూ. 118600
వెండి ఒక గ్రాము	రూ.121.60

'జనార్దనస్వామి' పాలకమండలికి దరఖాస్తు చేసుకోవాలి

కందుకూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని స్కంధపురి జనార్దనస్వామి ఆలయ నూతన పాలకవర్గం (ధర్మకర్తల మండలి) నియామకం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసినందున ఆసక్తి కలిగిన భక్తులు దరఖాస్తు చేసుకోవాలని ఆలయ ఈవో బైరాగిచౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 11 నుంచి 20 రోజుల లోపు ఆలయ కార్యాలయంలో అభ్యర్థులు తమ దరఖాస్తులను అందజేయాలని తెలిపారు. దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వారితో నూతన పాలకవర్గంను ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.



కలిగిరి పోలీస్‌స్టేషన్

క్షణ.. క్షణం..

భయం.. భయం!

● శిథిలావస్థలో కలిగిరి పోలీసు స్టేషన్ భవనం ● ఏ క్షణమైనా కూలవచ్చని ఆందోళన

కలిగిరి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరిన పోలీసు స్టేషన్ భవనం ఏ క్షణమైన కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో ఇక్కడ విధులు నిర్వహించే పోలీసులు, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు క్షణ క్షణం భయంతో ఆందోళన చెందుతున్నారు. ప్రజలకు ఎలాంటి అన్యాయం జరిగినా, సమస్యలు వచ్చినా తమకు న్యాయం చేసి రక్షణ కల్పించాలని పోలీస్‌స్టేషన్‌కు పరిగెత్తుకొస్తారు. ఇలా ప్రజల కష్టాలు తీర్చే పోలీసులకు పెద్ద కష్టం వచ్చింది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసులు తాము విధులు నిర్వహిస్తున్న కార్యాలయ భవనం ఏ క్షణం కూలిపోతుందో తమ ప్రాణాలను ఎలా రక్షించుకోవాలో అనే భయాందోళనలతో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవల కావలి డీఎస్పీ శ్రీధర్ కలిగిరి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించినప్పుడు శిథిలమైన భవనాన్ని గమనించి సిబ్బంది విధులు ఎలా నిర్వహిస్తున్నారని అన్నారంటే భవనం పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోంది. కలిగిరి పోలీస్‌స్టేషన్‌ను 1969లో నిర్మించారు. 56 ఏళ్ల క్రితం నిర్మించిన భవనం కావడంతో ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. భవనం గోడలు బీటలువారాయి. పైకప్పు పెచ్చులూడి పడుతుంది.

● వర్షం వస్తే కార్యాలయం మడుగే..

ప్రధాన రహదారి పక్కన లోతట్టు ప్రాంతంలో పోలీస్ స్టేషన్ ఉండటంతో చిన్నపాటి వర్షం కురిసినా కార్యాలయంలోకి వర్షపునీరు వచ్చి మడుగులా చేరుతోంది. ఆ నీటిని తోడి పోయాల్సి వస్తుందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు వర్షాకాలమంతా గోడలునాని చెమ్మగా ఉండటంతో గోడలకు కరెంటు సరఫరా అవుతోంది. వర్షాకాలం సమయంలో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందోనని సిబ్బంది హడలిపోతున్నారు. కాగా కలిగిరి పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాల నిర్మాణాలకు 2021లో పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇంజనీరింగ్ అధికారులు పట్టణం సమీపంలోని జిర్రావారిపాలెం వద్ద స్థలాన్ని పరిశీలించారు. త్వరితగతిన నిర్మాణం చేస్తామన్న అధికారుల మాటలు నేటికీ కార్యరూపం దాల్చకపోవడంతో పాతభవనంలోనే బిక్కుబిక్కుమంటూ పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై ఎస్ఐ ఉమా శంకర్ మాట్లాడుతూ భవనం శిథిలావస్థలో ఉన్న విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వర్షాకాలంలో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నాం. నూతన భవనం నిర్మిస్తే ఉపయోగకరంగా ఉంటుంది.



పెచ్చులూడిన శ్లాబు



ఇటీవల వర్షం కురిసినప్పుడు స్టేషన్‌లో నిలిచిన నీరు

ఏపీఆర్ఎస్ఏ కావలి డివిజన్ యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం



నూతనంగా ఎన్నికైన ఏపీఆర్ఎస్ఏ కావలి డివిజన్ యూనిట్ నూతన కార్యవర్గం

కావలి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కావలి తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఆదివారం జరిగిన ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్(ఏపీఆర్ఎస్ఏ) కావలి డివిజన్ యూనిట్ ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. ఎన్నికల అధికారులు పీ.హేమంత్‌కుమార్, కే శ్రీనివాసులు పర్యవేక్షణలో జిల్లా అసోసియేషన్ నాయకులు యూ.లక్ష్మి, పీ.నరసారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల్లో కావలి డివిజన్ యూనిట్ అధ్యక్షుడిగా కావలి తహసీల్దారు పీ.శ్రావన్‌కుమార్, కార్యదర్శిగా కావలి ఉపతహసీల్దార్ వీవీ మురళీధర్‌రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్‌గా దగదర్తి తహసీల్దారు పీ.కృష్ణ, ఉపాధ్యక్షులుగా కలిగిరి, అల్లూరు, విడవలూరు ఆర్ఐలు బీ.లీలాసుజీ, ఎస్.ప్రభుదీప్, ఎండీ అబ్దుల్ సలామ్‌లు ఎన్నికయ్యారు. కోశాధికారిగా బోగోలు ఉపతహసీల్దారు కే.భరత్, జాయింట్ కార్యదర్శులుగా కే.కనకాద్రి, ఏవీవీ ప్రసాద్‌రావు, ఎస్‌డీ గులాంలు ఎన్నికయ్యారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం.రాజేంద్ర ప్రసాద్, బీ.స్వప్న, జే.మొనాలిసీ థెరిస్సా, జిల్లా కౌన్సిలర్లుగా పీ.ఇమ్రాన్‌ఖాన్, ఎం.యానాది తిరుపతయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాని జిల్లా అసోసియేషన్ నాయకులు అభినందించారు.

వైర్‌లెస్ కమ్యూనికేషన్స్‌పై సదస్సు



డాక్టరు సురేంద్రలోయను సత్కరిస్తున్న కరస్పాండెంట్, తదితరులు

కందుకూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీలో ఇన్‌స్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మానవ రహిత వైమానిక వాహనం యాంటెన్నా డిజైన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్స్‌పై ఆదివారం ప్రత్యేక సదస్సు నిర్వహించారు. అకడమిషియన్, పరిశోధకుడు డాక్టరు సురేంద్రలోయ ప్రధాన అతిథిగా పాల్గొని యూఏవీ యాంటెన్నాల రూపకల్పన, వైర్‌లెస్ కమ్యూనికేషన్ సాంకేతికతలపై విద్యార్థులకు ప్రయోగాత్మక శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా కాలేజీ కరస్పాండెంట్ డాక్టరు కె.విజయ్‌శ్రీనివాస్ మాట్లాడుతూ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ విభాగాలు రాబోయే ఒకటిరెండేళ్లలో సైన్స్ ఇంజనీరింగ్ విభాగాన్ని మించిపోతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పరిశోధకుడు డాక్టరు సురేంద్రను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ రవికుమార్, ప్రొఫెసర్లు గద్దె సురేష్, హనుమంతరావు, రామకోటేశ్వరరావు, శ్రీకాంత్, మాధవరావు, మస్తాన్‌వలి, శ్రీహరి, రవి పాల్గొన్నారు.

రేపు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

లింగసముద్రం, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఈనెల 12వ తేదీన ఏడాది వయస్సు దాటిన చిన్నారుల నుంచి 18 ఏళ్ల వయస్సు లోపు విద్యార్థు లకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని లింగసముద్రం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ పీ.విద్యావతి చెప్పారు. ఈ మేరకు ఆదివారం స్థానిక పీహెచ్‌సీలో నిర్వహించిన సమావేశంలో పోస్టర్ ఆవిష్కరించారు. మండలంలోని 45 అంగన్వాడీ కేంద్రాల్లోని 1450 మంది చిన్నారులకు, 46 ప్రభుత్వ, 5 ప్రైవేటు పాఠశాలల్లోని 4374 మందికి 12, 20వ తేదీలలో ఆల్బెండాజోల్ మాత్రలు అందజేస్తామన్నారు. సీహెచ్‌వో జీ.శ్రీనివాసులు, పాల్గొన్నారు.

● **కొండాపురం(ఆంధ్రజ్యోతి):** అనీమియాను నివారించేందుకు 18 ఏళ్ల లోపు పిల్లలకు ఏడాదిలో రెండుసార్లు డీవార్మింగ్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నసీరుద్దీన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 5637 మందికి ఈనెల 12వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మాత్రలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

ప్రసన్నుడి పుష్కరిణి నిర్మాణం పూర్వజన్మ సుకృతం

● రూ.2.10 కోట్ల వితరణ చేసిన వేమిరెడ్డి దంపతులు ● కోనేరు, మహాప్రాకారం నిర్మాణాలకు శంకుస్థాపన

బిట్రగుంట, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కొండబిట్రగుంట బిలకూట క్షేత్రంలో వెలసి ఉన్న కలియుగ దైవం ప్రసన్న వేంకటేశ్వరస్వామి పుష్కరిణి తమ ద్వారా నిర్మాణం జరగనుండడం పూర్వజన్మ సుకృతమని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి దంపతులు పేర్కొన్నారు. ఈ పుష్కరణి నిర్మాణానికి రూ.2.10 కోట్ల విరాళం ఇచ్చిన వేమిరెడ్డి దంపతులు ఆదివారం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డితో కలసి శాస్త్రోక్తంగా భూమిపూజ చేశారు. దీంతోపాటు మొదట దేవాదాయశాఖ మంజూరు చేసిన రూ.1.65 కోట్లతో మహాప్రాకార నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న వేమిరెడ్డి దంపతులు, కావలి ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సతీమణి బీద జ్యోతిలకు ఈవో రాధాకృష్ణ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపుతో బిలకూట క్షేత్రం దిగి శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలల్లోనే ఆలయ అభివృద్ధికి రూ.15 కోట్లు తీసుకురావడం ఎమ్మెల్యే కృషికి నిదర్శనం అన్నారు. 800 ఏళ్ల చరిత్రగల ఈ ఆలయ అభివృద్ధిలో పాలి భాగస్వాములం కావడం అదృష్టమన్నారు. కోనేటి నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కోరారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దర్శించుకోవాలని ఎన్నోసార్లు అనుకున్నా, కానీ ఆయనకు సేవలందించేలా కోనేటి శంకుస్థాపన కార్యక్రమంతో దర్శించుకునే భాగ్యం లభించిందన్నారు. టీటీడీ చైర్మన్, ఈవో, ఇతర సభ్యులతో మాట్లాడి వేదపాఠశాల ఏర్పాటు విషయమై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతు వేమిరెడ్డి దంపతులు ఆలయ అభివృద్ధికి ముందుకు రావడం ఎంతో ఆనందదాయకమన్నారు. స్వామివారి కల్యాణ మండపం ఏర్పాటు సంకల్పనతో కొందరు దాతలను కలిశానని, త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ శ్రీరాం మాల్యాద్రి, ఆలయ ప్రధాన అర్చకులు ఈపూరి సత్యనారాయణ చార్యులు, కావలి ఏఎంసీ చైర్మన్ అలేఖ్య, బీద గిరిధర్, టీడీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, నేతలు విజయ్‌కుమార్, బీజేపీ నేతలు ఎస్ఎస్ యాదవ్, శ్రీనివాసులు యాదవ్, కే.బ్రహ్మానందం, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పుష్కరిణీ పున:నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీ వేమిరెడ్డి, కోవూరు, కావలి ఎమ్మెల్యేలు ప్రశాంతిరెడ్డి, కృష్ణారెడ్డి

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ఉదయగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం ఆదివారం మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కార్యాలయం ఎదుట పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ 51 ఏళ్లుగా ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణతోపాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తున్న ఏకైక సంఘమన్నారు. ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు నాయబ్, ఖాదర్‌బాషా, ఫణిరాజ్, మున్నా, సుబ్బారెడ్డి, చెంచయ్య, దుర్గాప్రసాద్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సారథ్య కార్యక్రమం విజయవంతం చేయాలి



సమావేశంలో పాల్గొన్న మండల బీజేపీ నాయకులు

సీతారామపురం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నెల్లూరు నగరంలో నిర్వహిస్తున్న సారధ్యం కార్యక్రమం విజయవంతం చేయాలని ఆదివారం స్థానిక బిజెపి నాయకులు పిలుపునిచ్చారు. మండల బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభి మానులు అధిక సంఖ్యలో పాల్గొ ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌సాయి సందీప్, కార్యదర్శి కాశిరావు, జిల్లా మాజీ కార్యవర్గ సభ్యుడు చెన్నుబోయిన నరసింహులు, రేనాటి వెంకటేశ్వర్లు, కుర్చేటి బ్రహ్మయ్య, వెంకటయ్య, దుర్గయ్య పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిపై దృష్టిపెట్టాలి



మాట్లాడుతున్న ఎంపీపీ పద్మజారెడ్డి

ఏఎస్ పేట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఎంపిపి పద్మజారెడ్డి సూచించారు. ఆదివారం ఆమె ఎంపిడివో ప్రసన్నకుమారి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె సమావేశానికి పలు శాఖల అధికారులు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి అధికారులే గైర్హాజరు అయితే అభివృద్ధి గురించి ఎవరితో చర్చించాలని అన్నారు. అనంతరం నులి పురుగుల నివారణ వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను చిరమన పీహెచ్‌సీ వైద్యులు జ్యోతిరాణితో కలిసి ఆవిష్కరించారు. తదనంతరం పలు శాఖలపై సమీక్షించారు. డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వర్లు, పలు శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ధ్యాన సాధన చేయాలి

వింజమూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ ధ్యాన సాధన చేయాలని హైదరాబాద్ సీనియర్ పిరమిడ్ మాస్టర్ నరసింహారావు అన్నారు. వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం నిర్వహించిన ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆయన పాల్గొని ధ్యానంపై అవగాహన కల్పించారు. అనంతరం శాకాహారం ప్రాముఖ్యత గురించి వివరిస్తూ కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హేమలత, పద్మ, స్వప్న, రవిచంద్ర, జానకిరామిరెడ్డి, అంకిరెడ్డి, 40 మంది ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా రెవెన్యూ డివిజనల్ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన రెవెన్యూ డివిజన్ నూతన కార్యవర్గం

ఆత్మకూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు రెవెన్యూ డివిజనల్ కార్యవర్గం ఎన్నిక ఆత్మకూరులో ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. రెవెన్యూ డివిజన్ నూతన అధ్యక్షుడిగా ఉదయగిరి తహసీల్దారు ఎల్ రామ్మోహన్, కార్యదర్శిగా ఆత్మకూరు డిప్యూటీ తహసీల్దారు డి శాంతిస్వరూప్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఏఎస్‌పేట డిప్యూటీ తహసీల్దారు జి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా సంధ్య ఏకగ్రీంగా ఎన్నికయ్యారు. ఎన్నికల నిర్వహణ అధికారులుగా ఎండి గయాజ్, జి సతీష్‌కుమార్, శేషయ్య వ్యవహరించారు. ఎన్నికల ప్రక్రియ అనంతరం నూతనంగా ఎన్నికైన 15మంది కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఈకార్యక్రమంలో నెల్లూరు జిల్లా రెవెన్యూ ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అల్లంపాటి పెంచలరెడ్డి, అనిల్ కుమార్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని మిగిలిన కార్యవర్గ అసోసియేషన్ ఎన్నికలు పూర్తయిన తరువాత జిల్లా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తా మన్నారు. రెవెన్యూ ఉద్యోగుల సమస్యలపై తాము నిరంతరం పోరాటం సాగిస్తామని తెలిపారు. ఆత్మకూరు డివిజన్ స్థాయిలో మొత్తం 73 మంది ఓటర్లు ఉండగా 15మంది కార్యవర్గ సభ్యులుగా పోటీచేసి ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు ప్యానల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు.

గంగమ్మకు కిరీటం బహూకరణ



గంగమ్మకు బహూకరిస్తున్న కిరీటం

వింజమూరు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గంగమెట్ట వద్ద ఉన్న గంగాభవానీ అమ్మవారికి ఆదివారం హైదరాబాద్ హైకోర్టు న్యాయవాది గుండ్లపల్లి మాల్యాద్రి యాదవ్ మకర తోరణం కిరీటాన్ని బహూకరించారు. అమ్మవారికి మొక్కుబడిలో భాగంగా సుమారు రూ. 2 లక్షల విలువ చేసే వస్తువులను అమ్మవారికి ఇస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా నరసింహులు



అనంతసాగరం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ బీసీ సెల్ అధ్యక్షుడిగా జడ పెంచల నరసింహులు ఎంపికయ్యారు. ఈసందర్భంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, డీసీసీబీ చెర్మన్ మెట్టుకూరు ధనుంజయ రెడ్డి, మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డికి ధన్య వాదాలు తెలిపారు. బీసీల సంక్షేమం కోసం పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొస్తానని ఆయన తెలిపారు.

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని గ్రామస్థుల ఆందోళన



శకునాలపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజలు

ఉదయగిరి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లను వెంటనే రద్దు చేయాలని ఆదివారం సీపీఎం ఉదయగిరి ప్రాంతీయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్థులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ కార్యదర్శి కోడె రమణయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం స్మార్ట్ మీటర్లను బిగిస్తే వ్యతిరేకించిన ప్రస్తుత ప్రభుత్వం మరలా స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు ఎలా ముందుకొస్తుందని ప్రశ్నించారు. గత ప్రభుత్వం రూ.32 వేల కోట్లు ప్రజలపై భారం మోపితే ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే రూ.30 వేల కోట్లు ప్రజలపై భారం మోపడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి స్మార్ట్‌మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలని, లేదంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పందిళ్ల వెంకటేశ్వర్లు, నాగరాజు, చిన రమణయ్య, వెంకటాద్రి, గ్రామస్థులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండాలి

సంగం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాయిబాబా మందిరంలో ఆత్మకూరు డివిజన్ కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పీఎంపీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) సభ్యుల సమావేశం జిల్లా అధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా పీహెచ్‌పి అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండి ప్రజలను చైతన్యపరచాలని సూచించారు. ప్రస్తుతం వైరల్ జ్వరాలు, టైఫాయిడ్, డెంగ్యూ, అతిసార వంటి వ్యాధులు ప్రబలుతున్నాయని, ఆ వ్యాధులతో వచ్చిన వారికి ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వ వైద్యశాలకు సిఫారసు చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల అనారోగ్య కారణాల వల్ల హైదరాబాదులో చికిత్స చేయించుకుని ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి పొందుతున్న నూతలపాటి శ్రీహరి బాబును పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జి శేషయ్య, ఎన్ ప్రసాదు, యు రామదాస్, పెంచలయ్య, డివిజన్ నాయకులు వెంకటేశ్వర్లు, జగన్మోహన్‌రావు, స్థానిక పీఎంపి వైద్యులు పాల్గొన్నారు.



శ్రీహరిబాబును పరామర్శిస్తున్న పీఎంపీ అసోసియేషన్ సభ్యులు

కాశీవిశ్వేశ్వరుని గ్రామోత్సవం



అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి గ్రామోత్సవం

సంగం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమనలో నూతనంగా నిర్మించిన అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం అర్ధరాత్రి వైభవంగా ముగిసింది. ఈసందర్భంగా వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ, అన్నపూర్ణదేవి, కాశీవిశ్వేశ్వరస్వామి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్లను నంది వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు కర్పూర హారతులతో స్వాగతం పలికి మొక్కులు తీర్చుకున్నారు.

నాగారపమ్మకు ప్రత్యేక పూజలు

సంగం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న పురాతన నాగారపమ్మ ఆలయంలో శ్రావణ మాసం మూడవ ఆదివారం పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పెన్నానది జలాలు, క్షీర, సకల ద్రవ్య, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన మహిళా భక్తులు పొంగళ్లు పొంగించి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.